# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి

సంపుటి 32 సంచిక 10

పేజీలు 40

జూన్ 2013

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన

చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL

***ఈ సంచికలో*** ................................ ....... **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| యోగవాశిష్ఠము | 12 |
| గురు కృపాహి కేవలమ్ | 14 |
| గురుదక్షిణ | 15 |
| పరిప్రశ్నేన సేవయా | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 18 |
| సుస్థిరమైన ప్రేమ | 21 |
| దర్జీవాడు | 23 |
| అగ్నివర్షం | 24 |
| ధ్యానఫలం | 25 |
| శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబు రెసిడిన్షియల్ స్కూలు | 27 |
| శ్రీకృష్ణుని బాలలీలలు | 28 |
| పుణ్యం - పాపం | 29 |
| గులాబీ కంపు | 30 |
| గుడి | 33 |
| శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకమ్
నేమా విద్యుతో బాన్తి కుతో యమగ్నిః
తమేవ భాన్తమ్ అనుభాతి సర్వమ్
తస్య భాసా సర్వ మిదం విభాతి ॥

(ముణ్డకోపనిషత్)

సాధకుడు సాధన చేయాలనే సంకల్పం కలిగిన తరువాత, సాధన కొనసాగిస్తాడు. సాధనకు కొన్ని అవరోధాలు కలుగవచ్చు. సాధన ప్రతిబంధకముగా తోచవచ్చు. కాని సాధకుడు తనకు సంభవించిన సాధన వికల్పం తనకు పరీక్ష అని గుర్తించగలిగితే సాధన కొనసాగిస్తాడు. సాధనలో పురోభివృద్ధి సాధిస్తాడు. చివరికి బ్రహ్మమును పొందుతాడు.



అటువంటి సాధకుడు అక్షర పరబ్రహ్మము అనేది ఎక్కడో లేదని, అది సర్వవ్యాపకంగా ఉందని గుర్తించినవాని స్థితిని తెలియజేస్తున్నది యీ శ్లోకము. ఆత్మజ్ఞాన సంపన్నుడైన స్థితిలో సూర్యచంద్రులు ప్రకాశించటం లేదన్న భావాన్ని అపార్థం చేసుకోకూడదు. సూర్యచంద్రులు ప్రకాశాన్ని విడిచిపెట్టారని కూడా భావించరాదు.

సాధకుడు అజ్ఞాన స్థితిలో సూర్యచంద్రుల ప్రకాశంతోనే లోకాన్నంతా చూశాడు. వ్యవహారం చేశాడు. తన ఉనికికి అవే ఆధారమని భావించాడు. ప్రవర్తించాడు. ఆత్మజ్ఞాన సంపన్నుడైన మరుక్షణం యదార్థాన్ని గుర్తించాడు.

ఆత్మ తేజస్సు దేనిపైనా ఆధారపడదు. ఏ యితర ప్రకాశముచేత తెలియ బడదు. ప్రకాశింప బడదు. ఆత్మ తేజస్సే అన్నిటికీ ఆధారము. దాని ద్వారానే అన్నీ ప్రకాశిస్తున్నాయి. సూర్యకాంతిలో ఒక దీపము యొక్క కాంతిని ప్రత్యేకంగా గుర్తించలేము కదా! అలాగే ఆత్మజ్ఞాన సంపన్నుడు సూర్యచంద్రాది ప్రకాశముగాని, నక్షత్రముల ప్రకాశమునుగాని భిన్నంగా గుర్తించడు. అంతా ఆత్మతేజస్సుగానే దర్శిస్తాడని భావించాలి. సాగరంలో లీనమైన నదీజలాన్ని వేరుగా గుర్తించగలమా?

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

32. కసవు తినును గాదె పసరంబు లెప్పుడు
చెప్పినట్లు వినుచుఁజేయుఁ బనులు,
వాటి సాటియైన మానవుఁడొప్పడా?
విశ్వదాభిరామ, వినుర వేమ!



తాత్పర్యము -

పశువులు గడ్డి తినుచున్నను యజమాని చెప్పినట్లు వినుచూ పనులు చేయును. మూర్ఖుడట్లు చేయడు. అతడు పశువు కంటె హీనుడు.

33. కసవును దినువాఁడు ఘనఫలంబుల రుచి
గానలేఁడుగాదె వానియట్లు
చిన్న చదువులకును మిన్న జ్ఞానము రాదు
విశ్వదాభిరామ, వినుర వేమ!

తాత్పర్యము -

గడ్డివంటి నీచ వస్తువులు తినువానికి మంచి పండ్ల రుచి తెలియదు. అట్లే తక్కువ చదువుకొన్నవానికి మంచి జ్ఞానము కలుగదు.

34. కుండ చిల్లిపడిన గుడ్డ దోఁపఁగవచ్చు
పనికి వీలుపడును బాగుగాను
కూలఁబడిన నరుఁడు కుదురుట యరుదయా
విశ్వదాభిరామ, వినుర వేమ!

తాత్పర్యము -

కుండకు రంధ్రము పడిన, దానికి గుడ్డ దోపిన యెడల, ఆ కుండను ఉపోయగించవచ్చు. కాని మానవుడు చెడ్డతనమునకు దిగినచో తిరిగి మంచి దారికి రాడు.



# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

"దయ్యాలు, భూతాలు ఉంటాయా ఎవరైనా యదార్థంగా వాటిని చూసినవారు ఉన్నారా?" అన్న ఒక భక్తుని ప్రశ్నకు సమాధానంగా శ్రీ బాబూజీ మహరాజ్ "చూపించమంటావా చూస్తావా?" అని ప్రశ్నించి, "మానవులు తీరని కోర్కెలతో గాని లేక గురుద్రోహము చేసి లేక గురు నిందవలన గాని యోగభ్రష్టులై సూక్ష్మ శరీరంతో పిశాచరూపంలో చేసిన కర్మ రహితం అయ్యేవరకు ఉండటం యదార్థమే. అంతవరకు నేను చెప్పగలను. గురుదేవుని అనుగ్రహం పొందేవరకు అది తప్పదు. సద్గురు మూర్తిని ఆశ్రయించి లక్ష్యార్థము స్వీకరించినవారు కడు జాగరూకతతో సంచరించాలి. మీరంతా నాతో వాకింగ్ చేస్తారుకదా. గురుమూర్తి నీడని కూడా త్రొక్కకూడదు సుమా. అలా చేస్తే దోషమే. నేను ఎన్నోసార్లు హెచ్చరించినా కొంతమంది భక్తులు తోలుచెప్పులువేసుకుని ఆశ్రమంలో తిరుగుతూ ఉంటారు. బాబుగారు ఎందుకు చెప్పారో అర్థం చేసుకున్నవారు ఎంతమంది? అలా చేయటం వలన వారికి సాధనలో తప్పక అంతరాయం కల్గుతుంది. జీవహింస చేయటమే తప్పు. అలా మృతిచెందిన ఆ జీవి చర్మముతో తయారు చేసిన పాదరక్షలే ధరించవలసిన అవసరం ఏముంది? సాధకులు కొన్ని నియమాలను పాటించాలి. అప్పుడే సాధన పురోగమిస్తుంది. సాధకులు ఇటువంటి నియమాలు పాటించవలసినవి చాలా ఉన్నాయి. గృహస్థాశ్రమంలో ఉన్న కొంతమంది పెద్దలు తాము సోషలిష్టులమని సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం పోరాడుతున్నామని మాటలు చెప్పుతారు. కాని వారియింట్లో భార్య పిల్లలు ఉన్నారన్న సంగతే మరచి పోయి ఇంట్లో ఉన్న పాలు, పెరుగు మీగడ అన్ని తమ స్వంతం చేసుకుని మిగిలినవారికి ఏమి దక్కకుండా కాజేస్తుంటారు.



అటువంటి ప్రవర్తనగల సాధకులు సాధనలో ఎన్నడూ పురోగతి సాధించలేరు. గృహస్థాశ్రమం అంటే హోమ్‌క్లబ్. భార్య, పిల్లలు అందరూ కలసి ఆనందంగా సత్సంగం చేసుకుంటూ సంతోషంగా కాలం గడిపితే సాధనకి లోటు ఏముంది?"

శ్రీబాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "పూర్వాశ్రమంలో నాతో తత్త్వవిషయాలు గూర్చి చర్చిస్తూ 'మీరు అమ్మవారిని దర్శించారు కదా మాకు కూడా జగన్మాతని దర్శింప చేయండి అప్పుడే నమ్ముతాము' అని తర్కించేవారు. అదే శాస్త్ర వాసన అంటే. వారు ఏది చెప్పినానమ్మరు. వారు అనుకున్నదే సత్యమని భావిస్తారు. అటువంటివారికి కనువిప్పు కల్గించాలి కదా! అయినా పికిలిపిట్ట నేమలి పిట్ట అంత

గ్రుడ్డు పెట్టాలంటే పెట్టగల్గుతుందా! సర్వవ్యాపకుడైన సచ్చిదానందుని దర్శించాలంటే ఈ చర్మ చక్షువులతో సాధ్యపడుతుందా? జ్ఞాననేత్రంతోనే సాధ్యపడుతుంది. సూర్యభగవానుడు ఎంత ప్రకాశవంతుడైనా, గ్రుడ్డివాడు వీక్షింపగల్గుతాడా! భగవానుడు సర్వవ్యాపకుడేకదా ఆయనను సర్వత్రాదర్శించవచ్చు కదా ఆయన దర్శనార్థం తిరుపతి, శ్రీశైలం, మానససరోవరం వెళ్ళటం ఎందుకు? అయినా ఆయనని దర్శించటానికి మధ్యలో గురువు మాత్రం అవసరమేముంది అని ప్రశ్నించిన వారులేక పోలేదు. గాలి సర్వవ్యాపకమైనదే. మన చుట్టూ ఆవరించి ఉంది. కాని మనము గాలి కోసము ఫ్యాన్‌లు ఎందుకువాడుతున్నాము. మన సంగతి అలా ఉంచండి.

వ్యాధిగ్రస్థులైన వారికి ప్రత్యేకంగా ఆక్సిజన్ అందించవలసిన అవసరం ఏముంది? మన చుట్టూ ఆవరించివున్న గాలి మనము కావలసిన విధంగా వినియోగించుకోవటానికి ఎలా పరికరంకావాలో అలాగే భగవంతుని దర్శించటానికి మార్గదర్శకుడు గురుమూర్తి. దేవాలయాలలో ప్రతిష్ఠింపబడిన మూర్తులద్వారా సర్వవ్యాపకుడైన పరమాత్ముని గుర్తించటానికి మార్గం సుగమం అవుతుంది" అన్నారు.

శ్రీబాబూజీ మహరాజ్ బోధని కొనసాగిస్తూ "నన్ను అమ్మవారి గురించి ప్రశ్నించిన చలపతి, రాజుగారు, శక్తీశ్వరరావులలో శక్తీశ్వరరావు వాదన కొంచెం హేతువాదానికి సమీపంలో ఉండేది. మహాత్ములు సంయమనము పాటించి సమయము వచ్చినపుడు కనువిప్పుకల్గిస్తారు. అదే జరిగింది.

ఒక నాటి సాయంత్రం ముగ్గురూ నాతో వాహ్యాళికి వచ్చారు. సూర్యాస్తమయం అయింది. ఊరుచివర నిర్జన ప్రదేశానికి చేరాము. అక్కడ జలాశయం ఉంది. శక్తీశ్వరరావు దృష్టికి గోచరించకుండా చలపతి, రాజుగారు అదృశ్యమయ్యారు. అతను భయంభయంగా 'బాబుగారు వీరిద్దరు ఏరి?' అన్నాడు నాకు మాత్రం ఏం తెలుసు నేను నీ ప్రక్కనే ఉన్నానుగా అన్నాను. ఎవరో తెలివితక్కువ వాళ్ళన్న మాట పట్టుకుని నాతో అలావాదించా వేమిటయ్యా అని మాట పూర్తికాక ముందే చెరువులో పెద్ద శబ్దంతో మెరుపు మెరిసింది. అతని దృష్టికి నేను కూడ కానరాలేదు. అతనొక్కడే అయ్యాడు. చెరువులో కన్పించిన దృశ్యంతో 'బాబుగారు' అంటూ అపస్మారస్థితిలో క్రింద పడిపోయాడు. జ్వరం తీవ్రంగా ఉంది. హాస్పిటల్‌కి తరలించారు. వారం రోజుల తర్వాత తాను అమ్మవారి ఉగ్రరూపాన్ని దర్శించి భయపడి మూర్ఛపోయానని చెప్పాడు శక్తీశ్వరరావు. అనన్యమైన భక్తితో సద్గురు మూర్తిని ఆశ్రయించి, సేవించి, గుణరహితుడై ఆయన అనుగ్రహంతో దివ్య దృష్టి చేత భగవంతుని విశ్వరూప దర్శనం సాధ్యపడుతుంది గాని తర్కంతో శాస్త్రజ్ఞానంతో వీలవుతుందా?" అన్నారు.

*

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాల ప్రసాద

గత సంచిక తరువాయి

అందుకనే, "మన్ కవాట్ ఖోలో – మలిన విషయ ధోలో – రామ్ కో బులాలో – ప్రేమసే అప్‌నాలో" అని ఒక కవి కీర్తించారు. మన మనస్సు యొక్క కవాటాలని తెరచుకుని, మలిన విషయాలన్నింటినీ అందుండి పారద్రోలి, ఆ రాముణ్ణి పిలచి, ప్రేమమీరా మనసులో నిలుపుకోవాలి. మలిన విషయాలని మనసునుండి బయటకి పారద్రోలిననాడే ఆ రాముడ్ని 'మన వాడిగా' గుర్తించ గలుగుతాం. అటువంటివాడే నిజమైన భక్తుడు. మనో కవాటాలని తెరచి, మనస్సుని విశాలం చేసుకుంటే, అప్పుడు విశ్వమంతా వ్యాపించి ఉన్న శక్తిని, ఒక ఉపాసనా మార్గాన్ని చేపట్టి, ధ్యానానుష్ఠాన ప్రక్రియల ద్వారా మనం పూర్తిగా తెలుసుకుని అనుభవించగలుగుతాము. ఆ అనంతమైన విశ్వవ్యాప్తమైన శక్తిని తెలుసుకోవడానికి మనిషి పెరగనక్కరలేదు. మనలో సూక్ష్మమైనటువంటి ఇంద్రియమొకటుంది. అదే 'మనస్సు'. దానిద్వారా ప్రతిదానిలోనూ వున్న సత్యాన్ని అనుభవించ గలుగుతాం.



ధ్యాన ప్రక్రియలో మన మనస్సు నిలవాలంటే నిత్య జీవితంలో కూడా మార్చుకోవలసినవి చాలా వున్నాయి. ప్రపంచ దృష్టిని వేరు చేసి, ఆ ప్రపంచాన్ని ప్రకాశింపచేస్తున్న పరమాత్మ వేపు మనస్సుని త్రిప్పాలి. సత్యము, ధర్మము, దయ, అహింస అనే గుణాలని పెంపొందింప చేసుకోవాలి. అప్పుడు ధ్యానానికి కూర్చోగానే, లేదా ఏ పనిచేస్తున్నాకూడా, మనస్సు మాత్రం యితర విషయాలలోపడి అశాంతిని పొందకుండా, శాంతినే పొందుతుంది. అందులోనూ స్వార్థ భావాలు పెచ్చు పెరిగిపోయిన ప్రస్తుత కాలంలో స్వార్థ భావాన్ని ప్రక్కకి నెట్టి, విశాలమైన దృష్టిని అలవరచుకుని, నిస్స్వార్థ భావంతో సేవ చేసిన నాడు, అక్కడ వేరు వేరు మతాలు లేవని, అనుభవపూర్వకంగా నా గురుదేవులు నాకు తెలియచేశారు.

మనందరం ఒకే భూమి మీద వున్నాం. మనందరం త్రాగే నీరూ ఒక్కటే. పీల్చే గాలి ఒక్కటే. అందరిలోనూ ప్రవహించే రక్తం ఒక్కటే. మనందరి శరీరాలలో వున్నదీ ఒక్కటే. మరి, 'తేడా' అనేది ఎక్కడినుండి వస్తోంది? ఒక్కసారి లోతుకి వెళ్ళి ఆలోచిస్తే తెలుస్తుంది. మన మనస్సు మనం చెప్పినట్టుగా వినటం లేదు. మనం ఎంతో గొప్పదైన విషయాన్ని అనుభవించాలనే కోరికతో వున్నాం. కానీ మన మనస్సు మాత్రం మనం చెప్పినట్టు వినటం లేదు. "నిలకడే లేని మనసా! ఎందాక నీ పయనం?" అది

ఎక్కడెక్కడికో పరుగెత్తుకు పోతోంది. మనస్సుకి నిలకడ లేదు. అది నీ మాట వినడం లేదు. ఉండడానికి యిక్కడే కూర్చుని వున్నాం. కానీ ఎప్పుడు మన టైము అయిపోతుందా, ఎప్పుడిక్కడనుంచి వెళ్ళిపోదామా అని చూస్తున్నాం! ఇలాగ చాలా చోట్లకి పరుగెడుతున్నాం. ఎప్పుడో ఈ జీవితానికి ఫుల్‌స్టాపు పడిపోతుంది. ఆ ఫుల్‌స్టాపు రాకముందే, కామా కూడా దగ్గరకి రాక ముందే తొందరపడి, మనలో వున్న సత్యాన్ని తెలుసుకోవాలి. ఈ "మేను"లో వున్న అసలు "నేను" ఏది అని గుర్తించడానికి, సమర్థవంతమైన ఒక గురుపాదాన్ని మనం ఆశ్రయించాలి.

నిలకడలేని మనస్సుకి ఒక ఆధారం కావాలంటే, మనం ఏ "శక్తి"నయితే ఆశ్రయించామో దానిని గట్టిగా పట్టుకొని, అందులో వున్న సత్యాన్ని గుర్తిస్తే, ఎవరి జీవిత పరమార్థాన్ని వారు గుర్తించగలుగుతాం. దీనికోసం ఎవరూ ఏమీ మతములు, పద్ధతులు మార్చుకోనవసరం లేదు. ఎవరాశ్రయించిన పద్ధతిని వారు ఆరూఢంగా విశ్వసించి ముందుకు సాగాలి. దారులెన్నైనా గమ్యం మాత్రం ఒక్కటే. పేరులు, మతాలు ఎన్నైనా, ఉన్న అనంత శక్తి మాత్రం ఒక్కటే. మన మనస్తత్వాలు, భావాలు ఎలావున్నా, శాశ్వతమైన శక్తిని పొందాలి అన్న మన అందరి ఆశయం మాత్రం ఒక్కటే. నిజమైన మతం అంటే (రియలైజేషన్) తెలుసుకోవడం లేక ఆత్మసాక్షాత్కారం. అంటే మనం మరచిపోయినటువంటి దానిని మరల మనకి గుర్తుచేసేటివంటిది 'మతం'.

ఈ ప్రపంచాకర్షణలలో పడిపోయి వ్యర్థమైన యితరేతర ఆలోచనలతో ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం అనే గుణాలకి లోబడిపోయి, మనం పొందవలసిన శాశ్వతానందము, ఆత్మ వస్తువు ఏదయితే వుందో, దానిని పొందలేకపోతున్నాము. అందుకని మన సనాతన సాంప్రదాయము, ఉపనిషత్తులూ, వేదాలు మనం ఏం పనులు చేయాలో, ఏవి చేయకూడదో యీ విధంగా ఘోషిస్తున్నాయి "సత్యం వద – ధర్మం చర – కాపట్యం న కుర్యాత్ – ఆత్మహితమాచరేత్" సత్యమే మాట్లాడాలి. ధర్మంగా చరించాలి. కాపట్యం కూడదు. ఆత్మకి హితమైనదే ఆచరించు – అనే ఈ ధర్మాలని అందరూ ఆచరించి తీరాలి. ఇవి వేరు వేరు మతాలలో వేరు వేరుగా లేవు. ఇవి అన్ని మతాలకి చెందినటువంటి సత్యాలు. కనుక సత్యానికి, ధర్మానికి వేరు మతం అనేది లేదు. తానాచరించ వలసిన ధర్మాలకి, సత్యానికి ఏ మతమని పేరు పెడతాము? సత్యము, ధర్మము అనేటటువంటి వాటిని గుర్తించే అర్హత ఈ మానవ జన్మకి మాత్రమే యిచ్చాడు భగవంతుడు.

ఇటువంటి సత్యాన్ని, ధర్మాన్ని ప్రబోధించడానికి అనేకమంది ప్రవక్తలు అనేక ప్రాంతాలలో ఉద్భవించి, వారాసత్యాన్ని, ధర్మాన్ని ఆచరించి, యితరులకి కూడా దానిని పంచిపెడుతున్నారు. వారు బోధించినది ఎవరు ఆచరిస్తారో, అనుసరిస్తారో, వారు కూడా

ఆ ప్రవక్తలేవిధమైన ఆనందాబుధిలో ఓలలాడుతున్నారో అటువంటి ఆనంద సముద్రంలో ఓలలాడగలరు. కానీ, ఆ మహానుభావులందించిన సత్యాన్ని, ధర్మాన్ని ఆచరించాలనుకునేటప్పటికి, మానవులకి 'మతములు' అనే పేరుతో వుండే మనస్తత్త్వాలు అడ్డుగోడలై నిలచి, వాటిని ఆచరించనీయటం లేదు.

దీనినే అమృతబిందూపనిషత్తు యీ విధంగా బోధించింది. "మనోహిద్వివిధమ్ ప్రోక్తమ్। శుద్ధంచా శుద్ధ మేవచ। అశుద్ధం కామసంకల్పమ్। శుద్ధం కామవివర్జితమ్।" మన మనస్సు శుద్ధము, అశుద్ధము అని రెండు విధాలుగా వున్నది. కామ సంకల్పములతో కూడిన మనస్సు 'అశుద్ధ మనస్సు' అని, కామమును (అనగా కోర్కెను) వీడిన మనస్సు "శుద్ధ మనస్సు" అని పిలువబడుతున్నాయి. మన మనస్సు మంచి మార్గంలో వెళుతున్నప్పుడే ఆ సత్యాన్ని మనం గుర్తించగలుగుతున్నాము. అలా కాకుండా, మనస్సు కామక్రోధాది గుణాలనే మార్గంలో వెళ్ళినపుడు వాటినే అనుసరించి అనుభవిస్తుంది.

"మనం" అంటూ బాగుంటే, తతిమ్మా మతాలేమిటో తెలుసుకుంటాం. మా గురుదేవులని ఒక భక్తులు "మిమ్మల్ని తెలుసుకోవాలని వుంది స్వామీ!" అని అంటే, ఆయన "ముందు నిన్ను నువ్వు తెలుసుకో అప్పుడు నేనెవరో నీకు తెలుస్తుంది" అని జవాబిచ్చారు. అదే విధంగా, మనం ఒక లక్ష్యాన్ని, లేక సత్యాన్ని గుర్తించాలి, సాధించాలి అని అనుకున్నప్పుడు ముందు మనం నమ్మిన మతంలోని పరమార్థం గుర్తించగలిగితే, యితర మతాలలోని నిజాన్ని గుర్తిస్తాం. అప్పుడు యిక "మతాలు" అనేవే లేవు అని. ఉన్నది ఒక్కటే "సత్యం" అని తెలుసుకుంటాం. ఆ అనంతశక్తే "అసలు నేను" అని గుర్తించాలి. ఈ విషయాన్నే రమణమహర్షి, రామకృష్ణ పరమహంస వంటి సమర్థులైన గురుస్వరూపాలు మనకి బోధ చేశాయి.

ముందుగా "నేను" బాగుంటేనే, ప్రొద్దుటే లేచి అందరినీ చూడగలుగుతున్నాను. అయితే, ఆ "నేను" ఎవరు అనేది గుర్తించడానికే ప్రవక్తలందరూ బయటకు వచ్చి చెప్పినటువంటి బోధలు. అది చెప్పినంత మాత్రాన, విన్నంత మాత్రాన అందేది కాదు. విన్నది ఆచరించి, అనుభవిస్తేనే అందుతుంది. కనుక, దానికోసం ప్రయత్నం చేయాలి. "త్యాగే నైకే అమృతత్వ మానసుః" అని వేదం ఘోషిస్తోంది. ఆ పరమమైన సత్యాన్ని గుర్తించాలి అంటే, కర్మల వల్లగాని, ధనం వల్ల గాని, పరివారం వల్ల గాని కాదు. అమృతత్వ స్థితి కేవలం త్యాగం ఒక్కదాని వల్లనే పొందబడుతుంది.

అటువంటి అమృతత్వ స్థితిని పొందడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను మనకి గురుశక్తి ప్రసాదించుగాక!!

*

# సన్నిధిలో సంభాషణ

– పరాశర పసాద్

28.6.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మనస్సు జన్మ జన్మల నుంచి ఆర్జించిన వాసనలను దాని పూర్వగుణాలను పోగొట్టుకోవాలంటే సాధన చేయాలి. ఆ సాధన గురుదేవుని కరుణా కటాక్షంతో మాత్రమే సాధ్యపడుతుంది. శుద్ధి చెందిన మనస్సు సప్తనాదాలను వినగలుగుతుంది. చివరగా ఘంటానాదము, ఆ తరువాత ఓంకారనాదము వింటూ ఆ ఓంకార నాదంలో లయించిపోతుంది. ఆస్థితిలో బాహ్య అంతరింద్రియాలన్నీ మనస్సులోనే లయించిపోతాయి. సాధకునికి ముఖ్యముగా ఆచరణ, నియమము అనేవి ఆవశ్యకము. ఇంతలో ఒక భక్తుడు శ్రీ బాబుని ప్రశ్నించాడు 'ఒక భక్తునికీ, సాధారణ వ్యక్తికీ తేడా ఎలా తెలుస్తుంది?' అని. శ్రీబాబు సమాధానం చెప్తూ కరెంట్‌గల రాగితీగ, కరెంటులేని రాగితీగ ఒకే రకంగా ఉంటాయి. కానీ కరెంటు గల రాగి తీగకి బల్బు తగిలిస్తే కాంతి వస్తుంది. understand?" అన్నారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "మహాత్ములూ, సాధారణ వ్యక్తులూ ఒకేరకంగా కనిపిస్తున్నా, మహాత్ముల నాశ్రయించిన వారు మధురానుభూతిని పొందుతారు. వారినుంచి వచ్చే వాక్కులు మధురంగా ఉంటాయి. అవి అనుభవపూర్వకంగా ఉంటాయి. వారు Theory, practical రెండూ తెలిసినవారు. Theory మాత్రమే తెలిసిన పండితులు శాస్త్రకారులు. వారు చదివిన గ్రంథాలలోని విషయాలను ఎంతో అనుభవం ఉన్న వారివలె తెలియజేస్తారు. కాని మధురానందాన్ని మాత్రం అందజేయజాలరు. మహాత్ములు అలా కాదు.



ఇక్కడ మీకొక దృష్టాంతం చెపుతాను. మీకొక మామిడి పండు లభించిందనుకోండి. దానిని మీరే భుజించి ఆనందిస్తే ఏంలాభం? అలా లభించిన మామిడి పండు లోని టెంకని, రసాన్నీ ఇతరులకందించి, వారిని ఆనందింపచేసి, తొక్కని మాత్రమే తాము స్వీకరిస్తే ఎలా ఉంటుంది? అదీ మహాత్ముల స్థితి! మీకు మహాత్ముల విషయాన్ని తెలియజేయటానికి ఇంకొక దృష్టాంతాన్ని చెపుతాను. పండితులు లేక శాస్త్రజ్ఞులు Theory మాత్రమే తెలిసిన వారు, ఏవిధమైన అనుభవాన్ని పొందనివారు. అలాగే అనుభవాన్ని పొంది practical తెలిసినవారు మరి కొంతమంది! వారు ఆనందాన్ని పొందుతారు. కాని వారు పొందే ఆనందాన్ని ఇతరులకి

అందచేయలేరు. కాని Theory, practical రెండు తెలిసిన మహాత్ములే సమర్థ సద్గురువులు! వారు ఆనందం పొందటమే గాక ఇతరులకి కూడా అందిస్తారు.

నువ్వు సాధకుడిగా ఉన్నప్పుడు మర్కటము వంటి నీమనస్సు గురుచరణార విందములపై లగ్నము అయ్యేవరకూ మర్కట కిశోర న్యాయముగానే ఉంటుంది. నీమనస్సు ఎప్పుడైతే పరమాత్ముని యందు లగ్నమైందో అప్పుడు నీబాధ్యతంతా ఆ పరమాత్మునిదే. అది మార్జాల కిశోర న్యాయము. గురుభక్తికి ఒక నిదర్శనం నా శిష్యులు చిరంజీవి రాజు, శేషగిరిరావు ఇరువురూ. వారిద్దరికీ నేనంటే ఏంతో భక్తి! నాపేరు చెప్పి బాబుగారికి మేం టికెట్ కొనిచ్చి కొంతపైకమిచ్చాం అని వారిద్దరి వద్ద నుండి డబ్బుకాజేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. నాపేరు చెప్పగానే ఎదురు ప్రశ్న వేయకుండా ఎంత డబ్బు కావాలన్నా ఇచ్చేవారు. అయ్యో! బాబుగారు ఇబ్బంది పడ్తారేమో! అని ఏడ్చేవారు కూడా. గురువుకోసం వారు సర్వం సమర్పణ చేశారు. అంతేకాని కపట భక్తి ప్రదర్శించలేదు.

గురుఆజ్ఞ శిరసావహించినవాడే జ్ఞానాన్ని పొందగలుగుతాడు. చిరంజీవి అంటే అందుచేతనే నాకిష్టం! అతని photo ఎప్పుడూ నాకు కనిపించవలసిందే! అటువంటి వ్యక్తియే శేషగిరిరావు! అతనిని 48 రోజులు అంపశయ్యమీద ఉంచాను. అన్ని కోరికలూ తీరిపోయాయా? అని ప్రశ్నించాను. ఇంకనాకే విధమైన కోరికలేదు అని చెప్పిన తరువాతనే కన్నుమూశాడు. అందుచేతనే వారిరువురు పొందవలసిన స్థితిని పొందారు" అన్నారు.

*

## మోక్షం ఎప్పుడు?

వయోవృద్ధులైన ఇద్దరు సాధకులు "తమకు మోక్షం ఎప్పుడు?" అని తర్జన భర్జన చేస్తున్నారు.
అక్కడే ఆడుకుంటున్న ఓ చిన్నపిల్ల జోక్యం కలిగించుకుని – "నేను చనిపోయినప్పుడు మీకు మోక్షం వస్తుంది" అంది.
ఆ పెద్దలకు అర్థం కాక, ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని ఆ పిల్లవంక ప్రశ్నార్థకంగా చూశారు.
ఆ పిల్ల అన్నది, "మీకు భాషా జ్ఞానం కూడా లేదే! 'నేను' చనిపోయినప్పుడు కదా మోక్షం!" అని.
అప్పటికి అర్థమైంది – ఆ పిల్ల అన్న ఛలోక్తి!

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

<u>జూన్ 2013</u>

3 సోమ శ్రీగురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

6 గురు మాసశివరాత్రి

17 సోమ శ్రీసుగుణ ప్రసాదమాతాజీవారి షష్టమ వార్షిక పుణ్యారాధన సా॥ సత్సంగం

23 ఆది పూర్ణిమ శ్రీ సద్గురుపాద పూజ.

<u>జులై 2013</u>

2 మంగ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

6 శని మాసశివరాత్రి , శనిత్రయోదశి

16 మంగ కర్కాటక సంక్రమణం దక్షిణాయనం ప్రారంభం

19 శుక్ర తొలి ఏకాదశి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

22 సోమ ఆషాఢ పూర్ణిమ, సత్సంగం, సద్గురుపాదపూజ, భక్తసమారాధన, చాతుర్మాస్య దీక్ష ప్రారంభం.

## విధి బలీయము

రామాయణంలో వాలి, తపస్సుచేసి తనను ఎదిరించి, యుద్ధముచేసేవాని బలంలో సగం బలం తనకు వచ్చేటట్లుగా వరం పొందాడు. అందువలన తమ్ముడు సుగ్రీవుడు తనతో యుద్ధం చేసినప్పుడల్లా పరాజయం పొందేవాడు. ఈ విధంగా వాలి శక్తి పెరుగుతూ, శత్రువు యొక్క శక్తి క్షీణిస్తూ ఉండేది. శ్రీరామచంద్రునికి యీ రహస్యం తెలుసు. సుగ్రీవుడు వాలితో యుద్ధం చేయటానికి శ్రీరామచంద్రుని సహాయం అర్థించినప్పుడు, శ్రీరాముడు తన శక్తిని సురక్షితంగా ఉంచుకునేందుకు చెట్టుచాటు నుండి ఒక బాణమును వదలి వాలిని వధించాడు. వాలి మరణిస్తూ "ఓ రామా! నేను నీకు ఎట్టి అపకారము చేయలేదుకదా! అయినా మీరు నన్ను హతమార్చారు. కాబట్టి మరుజన్మలో దీనికి మీరు లెక్కచెల్లించ వలసివస్తుంది" అని చెప్పి మరణించాడు.

మరుసటి జన్మలో శ్రీరాముడు శ్రీకృష్ణుడిగాను, వాలి భిల్లుడుగాను జన్మించారు. మహాభారత యుద్ధం ముగిశాక కొన్నాళ్ళకు శ్రీకృష్ణుడు ఒక చెట్టుక్రింద కాలుమీద కాలువేసుకుని నిద్రిస్తుండగా, భిల్లుడు వేటకువచ్చి, కనిపించే పాదంలోని పద్మచిహ్నాన్ని లేడి కన్నుగా భావించి, గురిచూసి తన బాణంతో కృష్ణుణ్ణి కొట్టాడు. తాను వేటాడిన జంతువును తీసుకోవటానికి దగ్గరగా వచ్చి, తాను చేసిన తప్పు తెలియగా, చేతులు జోడించి, తాను చేసిన ఘోరపాపాన్ని క్షమించమని శ్రీకృష్ణుణ్ణి వేడుకొన్నాడు. అప్పుడు కృష్ణుడు పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలియజేసి, యిందులో అతని తప్పు ఏమీ లేదని, కర్మ ఫలాన్ని తాను అనుభవవించవలసినదేనని చెప్పాడు.

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము -సుషుమ్న ప్రసాద

విశ్వామిత్ర మహర్షి యిలా కొనసాగించాడు. "ఓ రామా! నీవు కూడా శుకుని మార్గమునే అనుసరించాలి. ఎవరైతే ఆత్మజ్ఞాన సంపన్నుడౌతాడో అతనికి సహజంగా ప్రాపంచిక సుఖాల పట్ల విముఖత వస్తుంది. ప్రాపంచిక వస్తువులతో తాదాత్మ్యత చెందడు. విషయభోగాల పట్ల విరక్తి, విముఖత కలగటమనేది చాల కష్టము. మనసు విషయాదులపట్ల మొగ్గు చూపితే, బంధమనేది బలపడుతుంది. వాటియందు అనురక్తి లేకపోతే, బంధము సడలి క్రమేపి అంతరిస్తుంది. వాసనా రహితమవటమే మోక్షము లేక అంతిమ స్వేచ్ఛ. వాసనల ద్వారా విషయాదులపై పరుగిడే మనస్సు బంధాలకు దారి తీస్తుంది. ఎవరికైతే వాసనా రహితం అవుతుందో, వారికి ప్రాపంచిక సుఖాలపట్ల ముక్తులై, ముని పుంగవులై, పరిపూర్ణ విరాగమును పొందుతారు."



అప్పుడు విశ్వామిత్ర మహర్షి సభనలంకరించిన ఋషీశ్వరులనుద్దేశించి యిలా అన్నాడు " శ్రీరామచంద్రుడు తన అతీంద్రియ శక్తివలన గ్రహించిన జ్ఞానము మనశ్శాంతిని కలిగించటానికి వశిష్ఠ మహర్షి ఉపదేశముద్ర కావాలి. వారు మహాజ్ఞాని కనుక వారొక్కరే శ్రీరామచంద్రుని సందేహాలను తీర్చి, నిత్యశాంతి, సౌభాగ్యములను ప్రసాదించగలరు."

విశ్వామిత్రుడు, వశిష్ఠునితో " అయ్యా! బ్రహ్మదేవుడు మనిద్దరి మధ్య ఉన్న వైషమ్యాన్ని తొలగించి, మానవాళి శ్రేయస్సుకై ప్రబోధించిన సందేశాలు, జ్ఞానకథలు, అనుగ్రహభాషణము గుర్తున్నవి కదా! ఆ జ్ఞానబోధను శ్రీరామచంద్రునకుపదేశించి మనశ్శాంతిని చేకూర్చవలసింది. ఎవరైతే వాంఛారహితులై, యింద్రియ నిగ్రహము కలిగి ఉంటారో, వారు మాత్రమే సద్గురుమూర్తి ఉపదేశము వలన ప్రయోజనమును పొందుతారు. అలాకాక ప్రాపంచిక విషయములపై అనురక్తి కలిగిన అపాత్రునకు ఉపదేశిస్తే, కుక్క చర్మముతో చేసిన సంచిలో పోసిన పాలవలే కలుషితమవుతుంది." అన్నాడు.

దశరథమహారాజు, రాజదర్బారులో ఉన్న మహర్షులు విశ్వామిత్రుని సందేశమును ప్రశంశించారు.

అప్పుడు వశిష్ఠుడు విశ్వామిత్రునితో తిరిగి యిలా ఉన్నారు "ఓ మహర్షీ! నేను మీ ఆజ్ఞను శిరసా వహిస్తాను. జ్ఞానులు, మహాత్ములిచ్చిన ఆదేశాన్ని ఎలా

నిరాకరించ గలము? పవిత్రులు, నిర్మల మనస్కులైన, ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగిన వ్యక్తులకు జనన మరణ వలయం నుండి విముక్తిని ప్రసాదించటానికి, నిషాధ పర్వతంపై బ్రహ్మదేవుడు మనకు ఉపదేశించిన జ్ఞానకథలను నేను శ్రీరామచంద్రునికి వివరిస్తాను.

తదనంతరము ఆయనకు సందేహాలను తీర్చి, మహోన్నతమైన శాంతిని, నిత్యానంద సుధను ప్రసాదించటానికి చక్కని జ్ఞానకథలతో తత్త్వోపదేశం చేశాడు.

<u>ముముక్షు ప్రకరణము</u> –

వేదాంత మార్గములో పయనించే సాధకునకు లేక జ్ఞానయోగాన్ని సాధించాలనుకునే సాధకునకు నాలుగు లక్షణాలు తప్పక ఉండాలి. వాటినే సాధన చతుష్టయ సంపత్తి అంటారు. అవి నిత్యానిత్య వస్తువివేకము, యిహాముత్ర ఫలభోగ విరాగము, శమాది షట్కసంపత్తి, ముముక్షత్వము.

ఈ నాలుగు లక్షణాలతో పాటు, సుగుణములు కలిగి, మహాత్ములతో సాంగత్యము చేసి, బాల్యము నుండి ఆత్మజ్ఞాన గ్రంథములను అవగాహన చేసుకున్నవారికి మోక్షప్రాప్తి లభిస్తుంది. ప్రతి ఒక్కరూ సవ్యమైన సాధన చేసి, మహాత్ముల జ్ఞాన సలహాలతో, ఆత్మ జ్ఞాన గ్రంథములను పఠించి, పరిపక్వత సాధించాలి.

శ్రీరామచంద్రుడు వశిష్ఠమహర్షితోయిలా అన్నాడు "ఓ గురుదేవా! జన్మజన్మల నుండి సంక్రమించిన వాసనలు నా ఆధ్యాత్మిక సాధనకు అంతరాయాన్ని కలిగిస్తున్నాయి."

అప్పుడు వశిష్ఠ మహర్షి ప్రత్యుత్తరమిస్తూ "మహోన్నతమైన మనసుగల ఓ రాఘవా! నాశరహితమైన పరబ్రహ్మ తత్త్వమును స్వయంకృషితోనే సాధించాలి. పూర్వ జన్మనుండి వచ్చే వాసనలు ఉత్తర జన్మలకు కూడా కొనసాగుతాయి.

ఈ వాసనలు  శుభ వాసనలు, అశుభ వాసనలు అని రెండు రకాలు. అశుభవాసనలు జన్మ పరంపరకు దారితీస్తాయి. శుభవాసనలు జన్మ రాహిత్యం కలిగిస్తాయి. వీటిని అంటిపెట్టుకున్న వానికి ఆత్మాసాక్షాత్కారము లభిస్తుంది.

కాని అశుభవాసనలంటిపెట్టుకున్న వారికి బాధలు, కష్టాలు మిక్కుటమై, జనన మరణ వలయంలో బంధింపబడతాడు. అందుచేతనే ఓ రామా! అశుభ వాసనలను విడనాడి, శుభవాసనలను పెంపొందించుకునే కొలది, అశుభవాసనలంతరిస్తాయి. ఉపనిషద్వాక్యములను, మహావాక్యసారములను గ్రహించి, అనుభవములోనికి తెచ్చుకొని సాధన చేస్తే, స్వయం ప్రకాశంతో ఆత్మజ్ఞాన సంపన్నుడౌతాడు. కనుక విషయ వాంఛల ప్రలోభానికి వీడ్కోలు చెప్తే, నిత్యానందాన్ని సాధిస్తాడు.

– సశేషం

# గురుకృపా హి కేవలమ్

గత సంచిక తరువాయి - సుశీల ప్రసాద

ఆ రోజు పౌర్ణమి. గుంటూరులో శ్రీ పాండుగారింట్లో అందరూ సమావేశానికి వచ్చిఉన్నారు. అయితే అందరూ ప్రాణంలేని యింద్రియాలవలే ఉన్నారు. కారణం ప్రాణనాధుడైన గురుదేవుడు యింకా రాలేదు. సంధ్యా సమయం అయింది. అందరికీ తీరని వెలితిగా ఉంది. అయినా సరే, శ్రీబాబు ఉన్నారనే దృఢ విశ్వాసంతో సమావేశం ఏర్పాటు అయింది. సంకీర్తన ప్రారంభమయింది. సభ అనంతరం ధ్యానం, ప్రార్థన పూర్తి అయింది. దివ్యబోధ అందించవలసిన స్వామి ఊళ్ళో లేరు. నెమ్మదిగా అందరూ కూర్చున్నారు. స్వామి ఆసనంపైన ఛాయాచిత్రంలో చిరునవ్వులు చిందిస్తున్నారు.

సరిగా ఆ సమయంలో వెనకాల నుంచి ఎవరో 'నేను రెండు మాటలు మాట్లాడ వచ్చునాండీ?' అన్నారు. ఎవరో క్రొత్తవారు. అందరికీ ఉత్సాహం కలిగింది. 'తప్పకుండా చెప్పండి' అన్నారు. బాబు బోధ వినలేని లోటు తీరుతుందని అందరి హృదయాలు ఆనందంతో వికసించాయి. వారు ఎంతో చక్కగా మధురంగా శ్రీకృష్ణ తత్త్వం గురించి చెప్పి అందరికీ సంతోషం కలిగించారు. వారు ప్రసంగం ఆపగానే సభ ముగిసిందని లేచారు. 'చాలా బాగా చెప్పారు' అనే మాట అందరినోట వెలువడింది.

అందరూ భోజనలాకి యింటివారు పిలిచినందున వెడుతున్నారు. అప్పుడు పాండుగారి సతీమణి 'ఆ కొత్తవారిని కూడా భోజనానికి రమ్మనండి' అన్నారు. అప్పుడు గుర్తొచ్చి ఆ వ్యక్తికోసం వెతికారు. ఆయన ఎక్కడా కనబడలేదు. మెట్లుదిగి వీధిలోకి వెళ్ళిపోయారేమోనని అందరూ అటు చూశారు. ఆ మెట్లమీదనే కూర్చుని ఉన్న ఒక భక్తురాలు 'ఇటు ఎవరూ రాలేదు, నేను చూస్తూనే ఉన్నాను' అన్నది.

'ఎవరా వ్యక్తి? ఎటు వెళ్ళారు?' అని విచారించేసరికి అందరికీ అర్థమైంది. శ్రీబాబే ఆ రూపంలో వచ్చారని. అందరూ ఆనందంలో మునిగిపోయారు. ఆ మరునాడు శ్రీబాబు వచ్చారు. వస్తూనే గురువుగారితో "నిన్నరాత్రి సత్సంగం జరిగిందా? గోపికల కృష్ణభక్తి గురించి విన్నారా?" అంటూ ముక్కస్య ముక్కః అంతా పొల్లుపోకుండా చెప్పారు. పౌర్ణమిరోజున గుండుగొలను చేరి, మేడబాబుగారింట్లో ఆగి, వారి ఆతిథ్యం స్వీకరించి రాత్రి మేడమీద యోగనిద్రలో ఉండిపోయిన శ్రీబాబు కారులో మేడబాబుతో కలిసి గుంటూరు బయలుదేరి వస్తూ, "నిన్నరాత్రి గుంటూరులో పౌర్ణమి సమావేశం జరిగింది. ఆ సంగతులు వాళ్ళు చెబుతారు విను" అన్నారుట.

ఇది ఒక శ్రీగురుదేవుల లీలా వైభవము! ఎవరికి తెలియగ తరమౌను బాబును?

*

# గురుదక్షిణ

-శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామి

పూర్వము జనకమహారాజు మిథిలానగరాన్ని పరిపాలిస్తున్న సమయంలో, రాజ కార్యాలతోపాటు దైవచింతన, పరమార్థ విచారణ కూడా లెస్సగా సలుపుతు ఉండేవాడు. ఆయనకు ఆధ్యాత్మ తత్త్వ జిజ్ఞాస తీవ్రమైన కారణంగా, ఒకనాడు తన దేశంలో నలుమూలలా ఒక ప్రకటన గావించాడు.

"ఈ దేశంలో గల పండితులు, తత్త్వజ్ఞులు, వేదాంతులెవరెవరు కలరో వారందరూ రాజధానికి వచ్చి, రాజునకు బ్రహ్మజ్ఞానోపదేశము చేయాలి. అనుభవ పూర్వకంగా బోధించాలేగాని, నోటిమాటలతో కాదు. గుఱ్ఱపు రికాబులో కాలుపెట్టి, మరొక కాలు పెట్టేలోపల, అంటే క్షణకాలంలో బ్రహ్మానుభూతిని కలిగించాలి. అలా కలిగించలేని వారందరూ దేశ బహిష్కరణ చేయబడతారు" అని దండోరా వేయించాడు.

రాజుగారి యీ ప్రకటన దేశంలో పెద్ద సంచలనం కలిగించింది. పండితులు, కవులు, శాస్త్రవేత్తలు రాజుగారికి ఆత్మజ్ఞానం కలిగించే అంత శక్తిలేనివారగుటచే, దేశబహిష్కరణ శిక్షకు భయపడి అత్యంత చింతాక్రాంతులై ఉన్నారు.

అదే సమయంలో అష్టావక్రమహర్షి ఎక్కడకో పోవుచూ, ప్రజలందరూ చింతాగ్రస్తులై ఉండటం చూసి, కారణమడిగారు. విషయం తెలుసుకున్న మహర్షి వారికి అభయమిచ్చి, వెంటనే రాజప్రాసాదంలోకి వెళ్ళి, రాజుతో బ్రహ్మోపదేశం చేస్తానని ధైర్యంతో పలికాడు. జనకమహారాజు దానికి అంగీకరించాడు.

"ఉపదేశం ఏకాంతంగా చేయాలిగాని, బహిరంగంగా కాదు. కాబట్టి సమీప అరణ్యానికి రమ్మన"మన్నాడు అష్టావక్రమహర్షి. జనకుడు కొంత సైన్యాన్ని, అశ్వాన్ని తీసుకుని మహర్షితో కలసి సమీప అరణ్యానికి వెళ్ళాడు.

త్రోవలో ఒకచోట సైన్యాన్ని నిలిపివేసి, గురుశిష్యులిద్దరూ నిర్జన ప్రదేశానికి వెళ్ళారు. జనకుడు అక్కడ తన గుఱ్ఱపు రికాబులో ఒక కాలు పెట్టాడు. – 'రెండోకాలు పెట్టేలోపు బ్రహ్మజ్ఞానాన్ని కలిగించాలి' ఇది సమస్య. తరువాత అష్టావక్రుడు బోధకు ముందుగా గురుదక్షిణ ఇవ్వవలసినదిగా రాజును కోరాడు. తానేది కోరుకున్నా దానిని తప్పక ఇస్తానని జనకుడు పలికాడు. తక్షణమే మహర్షి 'నీ మనస్సును నాకివ్వు' అని కోరాడు. మహర్షి ఆదేశముప్రకారము జనకుడు అట్లే చేశాడు.

మనస్త్యాగముచే జనకుని శరీరము గుఱ్ఱముపై నిశ్చేష్టముగా ఉండిపోయింది. డ్రైవరులేని బండివలె దేహము కదలక మెదలక ఉండిపోయింది. అట్టి స్థితిలో జనకుని అక్కడే వదలి అష్టావక్రమహర్షి వెళ్ళిపోయాడు.

దూరంగా ఉన్న సైనికులు రాజుకై నిరీక్షించి వారి జాడకై స్వయంగా వెతకటానికి బయలుదేరారు. ఒకచోట గుఱ్ఱముపై నిశ్చేష్టముగా ఉన్న రాజును చూసి వారు ఆశ్చర్యచికితులై, అష్టావక్రుడేదో సమ్మోహన మంత్రాన్ని వేశాడని భావించి, ఆయన్ని వెతికి పట్టుకుని వచ్చారు.

అష్టావక్రుడు వచ్చి జనకుని స్పృశించగానే ఆయనకు స్పృహ కలిగింది. "జనక మహారాజా! నీవు ధన్యుడవు. త్రుటికాలంలో బ్రహ్మానుభూతి కలగటానికి అనువుగా నీ హృదయాన్ని అత్యంత పరిశుద్ధంగా చేసుకున్నావు. మనస్సును ఒక పదార్థంలాగా త్యజించటానికి తగిన సమర్థతను కలిగి ఉన్నావు. ఇక నీకు కొత్తగా బోధించవలసిన అవసరం లేదు. ఆత్మకు అడ్డుగా ఉన్న మనస్సును తొలగించటమే అన్ని బోధల యొక్క సారాంశము. అన్ని సాధనల యొక్క పర్యవసానము కూడా అదే. దీనినే అమనస్క స్థితి అంటారు. మనస్సనే అడ్డును తొలగించి శేషించినదే ఆత్మ. అట్టి ఆత్మానుభూతియే మోక్షము. మనోలయం ద్వారా, మనోత్యాగము ద్వారా నీవు అట్టి మహోన్నత్త స్థితికి వచ్చావు. కావున ధన్యుడవు!" అని అష్టావక్రమహర్షి పలికాడు.

జనకమహారాజు తనకు అట్టి సులభమగు మోక్షోపాయమును బోధించిన ఆ సద్గురువరేణ్యునకు సాష్టాంగవదనం ఆచరించి, తిరిగి సైన్యముతో అందరూ కలసి మిథిలా నగరమునకు చేరారు.

*నీతి - మనస్సును బహిర్ముఖంగా పోనీక, అంతర్ముఖంగా ఆత్మయందు లయింపజేసి, ఆత్మరూపుడై వర్తించుటయే మోక్షము. అట్టి మనస్త్యాగరూప ఆత్మస్థితినే జీవుడు సాధించ వలె. అదియే నిజమైన గురుదక్షిణ.*

*ఒక సాధువు భిక్షాటన కోసం ఒక యింటికి వెళ్ళి, అక్కడ వరండాలో ఎవరూ లేకపోవటం చూసి, అక్కడ ఉన్న వెండిగ్లాసు జోలెలో వేసుకుని బయల్దేరాడు. లోపలి నుండి అప్పుడే బయటకు వచ్చిన యజమాని యిది చూసి, "స్వామీ! భిక్ష తీసుకువెళ్ళండి" అన్నాడు.*

*"పో! మూర్ఖుడా! ఎంతసేపు నీ గుమ్మంలో నిలబడతాము? నీకిచ్చిన అవకాశం జారవిడచుకున్నావు" అన్నాడు సాధువు దర్పంగా "అయితే కనీసం నా వెండిగ్లాసునైనా యిచ్చివెళ్ళండి" అన్నాడు యజమాని. "వెండి గ్లాసా? గ్లాసు ఏమిటి నాయనా?నీవెవరు? నేనెవరు? సర్వం ఖల్విదం బ్రహ్మ. నీకీ భేద బుద్ధి ఎందుకు నాయనా?" అన్నాడు సాధువు.*

*యజమాని కోపంతో కఱ్ఱ తీసుకుని సాధువును నాలుగు బాదాడు. అదేమిటంటే, "నీవెవరు? నేనెవరు? కఱ్ఱ ఏమిటి? కొట్టటమేమిటి? సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నాడు యజమాని.*

# పరిప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

"అంత్యకాలములో మనస్సు ఎలా ఉంటుంది?" అని ప్రశ్నించిన భక్తునికి సమాధానంగా శ్రీ సద్గురుదేవులు మాట్లాడుతూ "మరణము అనేది చాలా భయంకర మైనది. మరణ వేదన గురించి చెబితే హడలి చస్తారు. ఎవరైనా వ్యాధిగ్రస్థులు మంచానపడి వైద్యం చేయించుకుంటుంటే ఆ యింటివారందరికీ ఆ వ్యక్తిమీద అపారమైన ప్రేమ. ఆయన బాధను చూడలేక 'భగవంతుడా! ఆయనను అలా బాధ పెడుతున్నావు. త్వరగా నీలో చేర్చుకోవయ్యా!' అని ప్రార్థిస్తే అది కొంతవరకు సమంజసంగా ఉంటుంది. అలా అనరు. బాధ చూడలేక పోతున్నాము. భగవంతుడు ఎందుకు కష్ట పెడుతున్నాడు. ఇలా బాధపడేకన్నా త్వరగా విముక్తి కలిగితే సుఖపడతాడు అంటారు.



నిజంగా మృతి చెందినవారంతా తరువాత సుఖపడుతున్నారా! ఆ విషయం ఎవరైనా చెప్పగలరా? అయినా బాధపడేది వ్యాధి గ్రస్థుడు. కర్మని రహితం చేసుకుంటున్నాడు. చూసేవారికి వచ్చిన బాధేమిటి? నిజమైన ప్రేమ కలిగినవారైతే ఆ మనిషికి సంతోషం కలిగించే పని ఏదైనా చేయవచ్చు కదా! మంచిమాటలు చెప్పవచ్చు. అది ఆ వ్యక్తికి తప్పక ఉపశమనం కలిగిస్తుంది.

సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన స్మరణ మరవటమే మరణము. లేకపోతే మరణము ఎక్కడది? అంత్యకాలంలో మనస్సులో ఏదైనా కోర్కె మిగిలి ఉంటే, దానికి సంబంధించిన పంజరముతో కూడిన జన్మ తప్పదుకదా!

గురు బిడ్డ అయినవాడు స్థూలదేహాన్ని త్యాగము చేసిన మరుక్షణము, మనస్సు ఆత్మలో లయమై సర్వవ్యాపకమైన తానుగా ప్రకాశిస్తాడు. అక్కడ గుణాలు లేవు. వ్యథ లేదు. అది ఆనంద స్థితి. అయితే గురుబిడ్డ అయి ఉండాలి. గురుబిడ్డ అంటే వివేకము, వైరాగ్యము, ఇంద్రియ సంయమనము కలిగిన ముముక్షువు. అంటే ఎంతటి వ్యథ కలిగినా గురు లక్ష్యార్థమందు తత్పరత, విశ్వాసము కలిగినవాడు. ఇది సాధ్యమేనా అని ప్రశ్నించవచ్చు. సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థము మరువక సాధనచేసే సాధకునికి ఏదీ అసాధ్యము కాదు" అన్నారు శ్రీబాబు.

*

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

సూర్యుడు నడి కుంట తీక్షణంగా వెలుగుతున్న వేళ, చెవులకు కుండలాలు, చేతివేలికి దర్భముడి ఉంగరం, చంకలో తాటాకు గ్రంధాలు ధరించిన భూసురుడొకడు నందరాజు ముంగిట్లోకి వచ్చాడు. లోపలికి తొంగి చూస్తూ 'అమ్మా!' అని పిలిచాడు. ఆ పిలుపు విని యశోదమ్మ వాకిట్లోకి వచ్చింది. "అయ్యా! ఎవరి కోసం? ఇలా లోనికి దయచేయండి" అన్నది సాదరంగా. "ఎవరూ?" అంటూ నందుడు కూడా వచ్చాడు అక్కడకి. "దారిన పోతూ, ఎండకి జడిసి లోనికి వచ్చాను. కాస్త దాహం యిప్పిస్తే..." మాట పూర్తి అయ్యేలోపు, నందుడు చూపిన ఆసనం మీద సుఖంగా కూర్చున్న విప్రునికి యశోదమ్మ కంచు చెంబు నిండా కమ్మని మజ్జిగ తెచ్చి యిచ్చింది.



"అయ్యా! తమరు ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెడుతున్నారు?" అని అడిగాడు నందుడు. "నా పేరు పేరిశాస్త్రి. నేను వేదాలు, పురాణాలు అన్నీ క్షుణ్ణంగా చదివాను. నా జీవితంలో మూడువంతులు చదువుతోనే గడిచిపోయింది" అన్నాడా వచ్చిన వ్యక్తి. అంతలో అక్కడకి రివ్వున పరుగెత్తుకుంటూ వచ్చాడు చిన్ని బాలుడు. క్షణంలో సగం సేపు ఆ పిల్లవాని వంక చూస్తూ ఉండిపోయాడు పేరిశాస్త్రి. అది గమనించిన నందుడు " మాకు లేకలేక కలిగిన నలుసు వీడు. పేరు కృష్ణుడు. కన్నయ్య అనే పిలుస్తాను" అన్నాడు. తండ్రిని ఆనుకుని నిలబడ్డాడు కన్నయ్య.

"నేను చదివినంతమేరా వేదవేదాంగాలలో పరమాత్మ లక్షణాలు, కార్య కారణాలు అన్నీ వర్ణించ బడ్డాయి. వేద శాస్త్రాలకి, పాండిత్యానికి అందలేకపోతున్న అవాజ్మానస గోచరుడైన ఆ దైవాన్ని కళ్ళారా చూడాలని ఆశ" చెప్పటం కొనసాగిస్తున్న పేరిశాస్త్రి మాటలు వింటూ కిసుక్కున నవ్వాడు కన్నయ్య.

నందుడు వెంటనే మందలింపుగా "తప్పు నాయనా! పెద్దలు మాట్లాడుతుంటే అలా మధ్యలో నవ్వకూడదు" అన్నాడు. "అది కాదయ్యా! అదిగో పెరట్లో కనిపిస్తున్న ఆవుకి, మొన్ననే పుట్టిన లేగదూడ పాలకోసం దానిచుట్టూ తిరుగుతోందేకాని, పొదుగు దగ్గరకి రావటం చేతకావటం లేదు. దాన్ని చూసి నవ్వాను" అన్నాడు కన్నయ్య పెదవుల మీద చిరునవ్వు మెరుస్తుండగా.

పేరిశాస్త్రి మళ్ళీ మాట్లాడటం కొనసాగిస్తూ " పరమాత్ముని దర్శించాలనే నా కొండంత ఆశ ఎప్పటికైనా తీరుతుందా? అని మధనపడిపోతున్నాను. ఏ మహానుభావులైనా చూపిస్తారేమోనని అలాంటివారి కోసం వెతుక్కుంటూ యిలా ఊరూరా తిరుగుతున్నాను"

అని నిరాశగా అన్నాడు. "నేను చూపించనా?" అన్నాడు అప్పుడే కన్నయ్య. నందుడు, విప్రుడు యిద్దరూ ఉలిక్కిపడ్డారు ఆ మాట విని. అప్పుడే అక్కడకి వస్తున్న యశోదమ్మ సంగతేమిటో తెలియకపోయినా "ఏం చూపిస్తావురా?" అంది కొడుకు మాటలు వింటూ. "అదేనమ్మా! ఆ బుల్లి దూడకి వాళ్ళమ్మ పొదుగుని. పాపం కనుక్కోలేక పోతోంది కదా!" అన్నాడు కన్నయ్య పెదాలమీద చిరునవ్వు చెదరకుండా. "అదా!" అన్నారు నందుడు, పేరిశాస్త్రి ఊపిరి తీసుకుంటూ.

"తమరి భోజనం మాట...." అంది యశోదమ్మ ఎలా అడగాలో తెలియక సందేహిస్తూ. "ఇక్కడికి వచ్చే దారిలో ఒక గ్రామంలో వంట చేసుకుని బయలుదేరానమ్మా. కాసేపు విశ్రాంతి తీసుకుని, ఇక్కడి నుంచి బయలుదేరతాను. మీకు అభ్యంతరం లేకపోతే...." పేరిశాస్త్రి అంటుంటే, "ఎంతమాట! మీరు మా యింటికి దయచేయటం మా భాగ్యం" అంది యశోదమ్మ. "మేము నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని వస్తాం. తమరిలా విశ్రమించండి" అంటూ దంపతులిద్దరూ లోనికి వెళ్ళారు. నందుడి మాట మేరకు ఉయ్యాలబల్ల మీద నడుం వాల్చాడు పేరిశాస్త్రి. అక్కడే తచ్చాడుతున్న కొడుకుతో "అయ్యవారికి నిద్రాభంగం చేయకు. బుద్ధిగా మసులుకో" అన్నాడు నందుడు. చల్లని గాలి సేద తీరుస్తుంటే కళ్ళు మూతలు పడ్డాయి బ్రాహ్మణునికి.

అది నిద్రా కాదు, మెలకువ కాదు. తెలిసీతెలియని స్థితిలో..... కళ్ళ వెనుక పెద్ద వెలుగు! అది అనంతంగా ఉంది. ఆ వెలుగు తెర పండితుని చుట్టుముట్టింది. అందులో మునిగిపోయాడాయన. అంతలో అది ఆకారం ధరించింది. ఆ రూపాన్ని తను చూసినట్లుగా తోస్తున్నది. ఎక్కడ? ఎప్పుడు? ఎవరు? మగత విడినట్లు అయి చటుక్కున కళ్ళు తెరిచాడు పేరిశాస్త్రి. ఎదురుగా నందబాలుడు నిలబడి ఉన్నాడు. "నువ్వా!" అన్నాడు పేరిశాస్త్రి. "అవును నేనే! మీకు నిద్ర మెలకువ వచ్చింది కదూ? నేను లేపలేదు కదూ? మా నాన్నగారు మళ్ళీ కోప్పడతారేమో!" అన్నాడు కన్నయ్య. బెదురుగా చూపులు చూస్తూ, తేనెలు ఒలుకుతున్నట్లుగా ఉన్న వాని పలుకులు వింటూ ఎందుకో పేరిశాస్త్రికి చాలా ఆనందమైంది.

"నేనే లేచానులే. భగవంతుణ్ణి వెదుకుతూ ఎందుకో నా కళ్ళు, మనస్సు కూడా బాగా అలసిపోయాయి. ఇప్పుడా కళ్ళకి పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగంతా ఏకాకారమైంది. ఆ ఆకారం చూడబోతే నీదైంది. ఏమిటీ విచిత్రం!". పేరిశాస్త్రి మాటలకి చాల చక్కగా మందహాసం చేశాడు గోపబాలుడు. ఆ చిరునవ్వు ఆయనకు మోహన జనకమైంది. పరవశించిపోతూ మళ్ళీ అన్నాడు "ఇన్నాళ్ళ నుంచి వెతుకుతున్నది నిన్నేనా?" అనుకోకుండా ఆయన నిండు మనసు నుండి వెలువడిన మాటలు వింటూ కన్నయ్య "రావలసిన చోటుకే వచ్చావు, చేరవలసిన చోటుకే చేరావు. నీ యాత్ర

ముగిసింది. చేరవలసిన చోటుకే వచ్చావు. నీ యాత్ర ముగిసింది. ఇక ముందు నువ్వు నడవబోయే దారిలో తోడుగా నిలిచి నీ చేయి పట్టుకుని నేను నడిపిస్తాను. ఇంతవరకు నువ్వు గణించిన పాండిత్యమంతా ఎవరి గురించి వర్ణించి చెప్పిందో ఆ విశ్వరూపుణ్ణి నేనే" అన్నాడు కన్నయ్య. పేరిశాస్త్రి బ్రహ్మానంద స్థితిలో మైమరచిపోయి, కన్నయ్య సుకుమారమైన దివ్య శరీరాన్ని గాఢంగా కౌగలించుకుని అట్లాగే ఉండిపోయాడు.

ప్రకృతిలో చరాచరాలన్నీ వేణుమోహనుని వాగామృతం వాహినిలో మునిగిపోయి తన్మయమై ఉండిపోయాయి. అమృతం వర్షించే నీలిమేఘం నుండి ఒక పెద్ద నీటి బిందువు నేలకు జారినట్లు, ఆకాశంలో మెరుపు మెరిసినట్లు, ఒక గోపిక నోటి వెంట ఒక వాక్కు వెలువడింది "ప్రభూ! ఇంతవరకు మాకందరికీ మీరు వీనుల విందుగా వర్ణించి చెప్పిన మీ లీలా కథనంలోని పేరిశాస్త్రి మీ దివ్య అనుగ్రహానికి పాత్రుడై మీ దర్శన, స్పర్శన, సన్నిధి, సంభాషణలకు పాత్రుడై సుఖాలు అంతగా అనుభవించేందుకు అతనికి గల అర్హత మీరెంచుకున్నది ఏది? శాస్త్ర జ్ఞానమా?" మాట పూర్తికాకముందే గోపీనాథుడు "అతని హృదయ వేదన, తపన.అపౌరుషేయములైన వేదాలు, వేదాంగాలు ఏ పరమ పురుషుని వర్ణించి చెప్పాయో, వాఙ్మానసాధారుడైన వానిని దర్శించాలనే పట్టుదలతో పయనం సాగిస్తున్న వాని సడలని విశ్వాసమే వానిని నా దగ్గరకు చేర్చింది. నేను పండితుడిననే అహంకారం ఆవరించి మాయలో పడవేయక ముందే, అతని మనస్సు నన్నాకర్షించింది. అప్పుడే పుట్టిన శిశువును తల్లి పొంగిపోయే ప్రేమతో చేతులలోకి తీసుకున్నట్లు, సద్గురు స్వరూపమై నేను ఆతన్ని చేరదీశాను. ఇప్పుడు నా బిడ్డ అయినవాడు ఎక్కడ ఉన్నా, నన్ను దర్శించ గలుగుతాడు. ఏ తావునైనా వానిలోనే నేను నిలిచి ఉంటున్నాను."

బృందావనంలో తూర్పు దిక్కున వేగుచుక్క పొడిచింది. తొలికోడి గొంతెత్తడానికి సిద్ధంగా ఉంది. సర్వకాల సర్వావస్థలయందు నిరంతరం ఎల్లడెలా ప్రతిధ్వనించే వేణునాదంలోని ప్రణవం ప్రతిజీవిని మేల్కొలుపుతున్నది.

హరిః ఓమ్ తత్సత్



అష్టదళోపరివేష్టిత లింగం
సర్వసముద్భవ కారణ లింగం
అష్టదరిద్ర వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివలింగం

# సుస్థిరమైన ప్రేమ

- రమణ ప్రసాద్

(మౌన ధ్యాన శిబిరంలో చేసిన శ్రీమాతాజీవారి ప్రసంగాల నుండి)

మనం మనస్సు పెట్టి భగవన్నామం భగవస్సన్నిధిలో చేశాము. ఏది గుర్తించాలో ఆ మార్గంలోనే ఉన్నాము. మానవుడు భార్యాపుత్రాదుల కోసం ఎంతో శ్రమతో కూడబెడతాడు. పశు పక్ష్యాదులు అప్పటికప్పటికి కావలసిన ఆహారాన్ని సంపాదించుకొని తృప్తి పడతాయి. వస్తువులు పెట్టుకోవటానికి లాకర్లు, వండినవి పెట్టుకోవటానికి ఫ్రిజ్‌లు కావాలి. ఫ్రిజ్‌లో దాచిపెట్టి తింటే రోగం వచ్చి, యోగం ఫలించటం లేదు.

భగవంతుడు ఒక అవతారం ఎత్తి వస్తే మనం గుర్తించలేము. మరి యశోద వేసిన శిక్షను కృష్ణుడు భరించాడు. తల్లిదండ్రులు పిల్లల్ని ఎలా పెంచాలో చూపించాడు. మన్ను తిన్నాడా కృష్ణుడు? తిన్నాడు. మనం కూడా ఓషధుల రూపంలో మన్ను తింటున్నాము.

అమ్మ భయపెడితే భయపడ్డాడు కృష్ణుడు. అన్న బలరాముడు 'మన్ను తిన్నావా?' అని అడిగితే 'భూమి నా భార్య' అన్నాడు. ఎలాగైనా తన మీద కొన్ని చాడీలు చెప్పించి కొట్టించాలి అని, అప్పుడు తనని గుర్తించాలని భగవంతుడు కొన్ని చేష్టలు చేస్తాడు. ఆ చేష్టలు ముక్తికి కరతలామలకమే అవుతాయి.

అమ్మ అడిగింది 'కన్నయ్యా! మన్ను తిన్నావా?' అని. "అమ్మా! మన్ను తినటానికి నేనేమైనా శిశువునా? ఆకలితో ఉన్నానా? లేక వెర్రివాడినా?" అంటాడు కృష్ణుడు. యశోద "ఏదీ నోరు తెరు" అంటుంది. కృష్ణుడు సందేహించాడు. నోరు తెరిస్తే ఆమె ఏమైపోతుందో అని. చివరకు నోరు తెరిచాడు.

తల్లి విస్మయం చెందింది. ఆ నోటిలో అనంత బ్రహ్మాండాలు, సప్త సముద్రాలు చూసింది. యశోద ఆశ్చర్యంతో "నే నెవరు? నే నెక్కడ ఉన్నాను? ఇది కలా? లేక వైష్ణవ మాయా? నేను యశోదను కానా?" అని సందేహంలో పడితే, మళ్ళీ మాయ కమ్మి, 'అమ్మా!' అని పిలిచేసరికి తాను చూసినదంతా మరచిపోయి తిరిగి కృష్ణుణ్ణి ప్రశ్నలు వేసింది. అంతలా ఆ పాదాలను మనం చూశామా? ఎవరికి వారు ప్రశ్నించుకుని సమాధానం పొందాలి.

భగవంతుడి పట్ల ప్రేమ రావాలి. మనసులో ఆ ప్రేమను రంగరించుకోవాలి. అప్పుడే అది భాగవతమవుతుంది. లేకపోతే అది భాగోతమే. దారా పుత్రాదులను ప్రేమించాలి, పోషించాలి నిజమే. కానీ ఆ ప్రేమలో మమకారం రాకూడదు. గోపికలు

అలా శ్రీకృష్ణుని పొందారు. “ప్రభూ! నీపై నా మనస్సును మరల్చ”మని ప్రార్థించారు. భగవంతుడు కొందరికి దర్శనం యిచ్చి, తమకు దర్శనం యివ్వకపోతే మనస్సులో వస్తుంది చీట. వెంట్రుకవాసి చీట నాగార్జునసాగర్ డామ్‌కే ముప్పుతెస్తుంది అనేవారు శ్రీగురుదేవులు. అప్పుడు యిలా అనుకోవాలి ‘యింకా భగవంతుని స్మరణలో ఉండాలనే కదా’ నాకు దర్శనం యివ్వలేదు. ఈ విధంగా వందనం చేసి తనను తాను గుర్తించే ప్రయత్నం చేయాలి.

సర్వసమత్వం లేదా సమదృష్టి అలవరచుకోవాలి. చీమను చూడండి బెల్లం కాని, చక్కెరకణం కాని దొరికితే దాని చుట్టూ భ్రమణం చేసి, తన సైన్యాన్ని అంతటినీ పిలచుకు వస్తుంది. అంతేకాని తను ఒక్కతే అనుభవించదు. మనదో, ఏక పక్షం! గురుదేవులు “నీకు తక్కువ చేసుకోకు. ఇతరులకు పంచు” అనేవారు.

బాబూజీ భక్తులకు ప్రసాదం పెట్టి వెంటనే తినమనేవారు. వీర బ్రహ్మం గారు తన పుత్రులలో నిమ్న భావం పోగొట్టాలని ఎదురుగా ఒక చచ్చిన కుక్కను చూపించి, ‘ఆ కుక్క మాసం తింటే మీకు ఆధ్యాత్మిక సంపద లభిస్తుంది’ అన్నారు. వారు అసహ్యంచు కుని తినటానికి నిరాకరించారు.

కాని అప్పుడు శిష్యుడైన సిద్ధయ్యను తినమన్నారు. అతనికి అక్కడ చచ్చిన కుక్క గోచరించలేదు. అది మధుర పదార్థంగా గోచరించింది. దాన్ని ప్రసాదంగా ఎంతో ఆప్యాయతగా స్వీకరించాడు. ఆధ్యాత్మిక సంపదకు వారసుడయ్యాడు.

ఈ శరీరాన్ని నేను అనుకోవటమే మమకారం. ఈ శరీరం మనతో రాదు. సాధన కోసమే దీన్ని భగవంతుడు మనకు ప్రసాదించాడని భావించాలి. భార్యా పుత్రుల ప్రేమ అవసరార్థ ప్రేమ. భగవంతునిది అసలైన ప్రేమ. కాబట్టి మాధవుని పదములు మరువకూడదు. మనుస్సును ఆ పదములపైన నిలపాలి. మనస్సు అక్కడ నిలచిపోవాలి. ఈ శరీరం నాది కాదు. దీనికి ఎంత చేసినా, యిది పోయేదే. అనంతంగా ప్రకాశించే ఆత్మ స్వరూపం ఏదైతే ఉందో ఆ భావనలో ఉండాలి.

‘నేనూ నాదీ దూరమైతే నీవు నీవుగా నిలిచెదవురా ఇది నిజమురా ఇదే సత్యమురా’ అని శ్రీగురుదేవులు వక్కాణించి చెబుతున్నారు. అడ్డుగా వచ్చే కామక్రోధాదులను అర్పించాలి. మానవుడు మాధవుడుగా మారాలి. మనస్సే జడము. ఆత్మ తేజస్సే మనస్సును ప్రకాశింప జేస్తోంది అని గుర్తించాలి.

*

# దర్జీవాడు

– కొండ వెంకట రాజు

సారు – అనగగనగా ఒక బట్టలు కుట్టే దర్జీవాడు ఉన్నాడు. వాడు ప్రజలకు కావలసిన విధంగా రకరకాల బట్టలు కుడుతూ ఉంటాడు. వాడి దగ్గర రెండు ముఖ్యమైన (టూల్స్) పరికరాలు ఉన్నాయి. అవి ఎమిటి పిల్లలూ??

పిల్లలు – సైలెంట్ (సమాధానం లేదు).

సారు – వాడి దగ్గర ఒక కత్తెర, ఒక సూది ఉంటాయి. కత్తెరతోటి పెద్ద బట్టని ముక్కలు ముక్కలుగా కొలతల ప్రకారం కట్ చేస్తాడు. ఆ కత్తెరని అందుబాటులో ఉంటుందని తన కాళ్ళ దగ్గర పడేస్తాడు. కలసిమెలసి ఉంటేవాళ్ళని తంపులు పెట్టి విడదీసి, ఇంకా ఇంకా విడదీసి ఆనందించేవాళ్ళని యీ కత్తెరతో పోల్చవచ్చు. 'అలాంటివాళ్ళు నాకు ఇష్టం లేదు' అంటున్నాడు భగవంతుడు. ఇక వాడు తన దగ్గర ఉన్న సూదితో ఏం చేస్తాడు పిల్లలూ??

పిల్లలు – కట్ చేసిన పీసులను కుడతాడు.

సారు – అవును. ముక్కలను కుట్టి షర్ట్, గౌనుగా మార్చేస్తాడు. వీలుగా ఉంటుందని ఆ సూదిని తన టోపీలో గుచ్చుకుంటాడు. అక్కడైతే క్షేమంగా ఉంటుందని. పిల్లలూ సూది మనకు ఏమని బోధిస్తోంది??

పిల్లలు – సైలెంట్ (సమాధానం లేదు).

సారు – సమాజంలో అందరినీ ఒక్కటిగా చేర్చండి. భిన్నత్వం లేదు అని చాటండి. మీరు సమాజానికి తలలో నాలుకగా మారిపోతారు. సమాజం మిమ్మల్ని తలమీద పెట్టుకుంటుంది. చదువుకున్నవాళ్ళకే అటువంటి గౌరవం లభిస్తుంది. పిల్లలూ! మరి కత్తెర ఏమి బోధిస్తోంది?

పిల్లలు – సైలెంట్ (సమాధానం లేదు).

సారు – మరి సమాజం మిమ్మల్ని గౌరవించాలనుకుంటే మీరు బాగా చదువుకోవాలి. 500 పైగా మార్కులు తెచ్చుకోవాలి. 10వ తరగతి మీకు ఫౌండేషన్ లాంటిది. ఫౌండేషన్ సరిగా లేకపోతే మనం పై చదువులు చదువలేము. ఫౌండేషన్ సరిగా లేని యింటి మీద ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ కడితే, బీటలు వచ్చి యిల్లు కూలిపోతుంది కదా??

కాలం అన్నింటిలోకి విలువైనది. మీ బాల్యం వృథా అయిపోతే తిరిగి రాదు. మీరు బాల్యంలో ఫౌండేషన్ బలంగా వేసుకుంటే, ఇంటర్, ఎమ్‌సెట్ లాంటి పరీక్షలు ఎక్కువ కష్టపడకుండానే గట్టెక్కుతారు. ఎందుకంటే బాగా చదువుకునే బుద్ధి మీ బ్లడ్‌లోకి వచ్చేసింది కాబట్టి. ఈ ఆశ్రమ వాతావరణములో శ్రీసద్గురుదేవులు అట్టి శక్తిని, భక్తిని మనకి యిస్తున్నారు. మనం గట్టి నమ్మకాన్ని కలిగి ఉండాలి. మీకు మీ మీద మీకు ఉండే నమ్మకం, సమాజం మీద ఉండే గౌరవం, మీ గురువులమీద ఉండే భక్తి మీకు ఎక్కడలేని బలాన్ని యిస్తాయి. మీరు ఆలా ఉంటారా పిల్లలూ??

పిల్లలు – (కోరస్‌గా ) ఎస్ సార్!

# అగ్నివర్షం

- పళని

(ఈ కథ 1983 జూన్ సద్గురుమాసపత్రికలో ప్రచురింపబడినది)

గలేలియా దేశంలో ఓ పల్లెటూరు శివారులో రోడ్డుప్రక్క ధూళిలో, ఒక గురువు పన్నెండుమంది శిష్యులతో కలసి కూర్చుని ఉన్నారు. వారంతా బాగా అలసిపోయి ఉన్నారు. ఆ రోజు ఉదయం నుండి ఎర్రని ఎండలో నడిచి, నడిచి వస్తున్నారు వారంతా. వారిలో యిరువురు, ఆ ఊరిలో తమ గురువుగారికి వసతి చూడటానికై ముందుగా వెళ్ళారు. మిగిలినవారు వారి రాకకై ఎదురు చూస్తూ రోడ్డు ప్రక్కగా కూర్చుని ఉన్నారు.

కొంతసేపటికి ఆ యిరువురూ తిరిగి వచ్చారు. వారికళ్ళు కెంపెక్కి ఉన్నాయి. స్వరాలు ఆగ్రహంతో కంపిస్తున్నాయి. ఆ ఊరి ప్రజలు గురువుకు వసతి, ఆహారం యివ్వటానికి ఖచ్చితంగా నిరాకరించారు. 'అసలు మా ఊరిలోకే రావద్దు, మరో ఊరు వెతుక్కోండి' అన్నారట. ఆ శిష్యులు ఆగ్రహంతో ఉడికిపోతున్నారు. ఈ అడవిగ్రామం తమ గురువును రావద్దని చెప్పటమా! ఇంతకంటె క్రూరమైనది, కృతజ్ఞతా హీనమైనది మరొకటి ఉంటుందా? తమ గురువుగారు ఎంతటి మహిమాన్వితుడు! గ్రుడ్డివాళ్ళకు చూపు, కుంటివారికి కాళ్ళు యివ్వలేదా? దరిద్రులను ఆశీర్వదించలేదా? ముఖ్య నగరాలలో వేలాదిమంది జయజయ ధ్వానాలతో ప్రభువును ఆరాధించలేదా? ఆ ప్రభువుతోపాటు ఆ శిష్యులూ గౌరవించబడ్డారు. అందరి మనస్సుల్లో ఉన్నతులైనారు. ఇప్పుడు యీ గ్రామస్థులు తమ ప్రవేశాన్ని నిరాకరిస్తున్నారు. శిష్యులు ఒడలెరుగని ఉగ్రంతో "ప్రభూ! ఈ ప్రజలు శిక్షార్హులు. స్వర్గం నుండి అగ్నివర్షం కురిపించి యీ గ్రామాన్ని భస్మీపటలం చేయండి" అని అందరూ కసిగా అన్నారు. 'స్వర్గం నుండి అగ్నివర్షం కురవాలి! అగ్నివర్షం! అగ్నిదేవుడా! నీకు స్వాగతం!' యిదే శిష్యుల మనస్సులోని ఆలోచన.

ఒక్కొక్క సమయంలో ఏమీ మాటలాడకుండా మౌనంగా ఉండటం ఎన్నో మాటలు చెప్పటకంటె శక్తివంతంగా ఉంటుంది. గురువు సుందరరూపం దుమ్ముతో కప్పబడి ఉంటుంది. ఆ దివ్య లోచనాలు భవిష్యత్తును దర్శించి అలసి ఉన్నాయి. చాలా ఘోరమైన రోజులు సమీపిస్తున్నాయి.

ఆ రోజు నిజంగా ప్రభువు విశ్రాంతిని అభిలషించాడు. అదే కఠినంగా నిరాకరించ బడినది. ఆయన మౌనంగా లేచి, దుస్తులను దులుపుకుని, పొడవైన శాలువాను వేసుకుని, ముందుకు సాగిపోతున్నాడు గురువు.అవమానంతో, ఆగ్రహంతో, ఆశాభంగంతో ఆ శిష్యులు అనుసరిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలనుండి వారు ఆ గురువును కొలుస్తున్నారు. కాని ఆయన అసలు రూపాన్ని వారు కొంచెమైనా చూడగలిగారా?

(మిగిలిన భాగం 29వ పేజీలో చూడండి)

# ధ్యానఫలం

– రత్నం

భగవంతుని పూజించటం వలన, ధ్యానించటం వలన ఏమి ఫలం? స్వార్థం లేకుండా ఎవరూ ఏపనీ చేయరు. ఒక వ్యాపారం ప్రారంభించారనుకోండి మనం పెట్టిన పెట్టుబడికి తగిన ప్రతిఫలం లభిస్తున్నప్పుడే శ్రద్ధ, ఉత్సాహం కలుగుతాయి.



అయితే ప్రతిఫలం రావటానికి కేవలం పెట్టుబడి ఒక్కటేనా? మన కృషి కూడా ఉండాలి. యజమాని తెల్లవారు జామున లేచి, స్నానం చేసి, ధ్యానం చేసుకుని ఉదయం 7గం. కొట్టుకు వెళ్ళాడనుకోండి, గుమాస్తా తప్పకుండా టైమ్‌కి రావలసి ఉంటుంది. ఎవరి పని వాళ్ళు జాగ్రత్తగా చేసుకుంటారు. ఎక్కౌంట్లు ఎప్పటికప్పుడు సరిచూసి ఉంచుతారు. అలాంటప్పుడు సరస్వతీ ప్రసన్నంతోపాటు లక్ష్మీ ప్రసన్నం కూడా ఉంటుంది. అంటే లాభాలు బాగా వస్తాయి.

అలా కాకుండా సోమరితనం పెంచుకుని, సరిగా కొట్టుకు వెళ్ళకుండా, లెక్కలు సరిచూసుకోకుండా, గుమాస్తాలు ఎలా ఉంటున్నారో కనుక్కోకుండా, ఏదో బుద్ధి పుట్టినప్పుడు కొట్టుకు వెళ్తూ ఉంటే ఆ ఆసామి లాభాలు పొందటం కష్టం. ఇంక మూడో రకం వాళ్ళు కూడా ఉంటారు. వాళ్ళు అసలు కొట్టుకే వెళ్ళరు. వ్యాపారం ఏమైపోతోందో పట్టించుకోరు. ఎప్పుడూ చతుర్ముఖ పురాణమో, లోకాభిరామాయణమో కావాలి. మరి వాళ్ళకి, పెట్టిన పెట్టుబడి కూడా దక్కదు.

వ్యాపారమైనా, వ్యవహారమైనా, మరి యే వృత్తియైనా, శ్రద్ధ ఉన్నవాడికి లాభిస్తుంది. కృషితో నాస్తి దుర్భిక్షం – కష్టపడిన వాడికి ఫలితం ఉంటుంది. సాధన కావాలి. మా ఆధ్యాత్మిక రంగంలో కూడా ఇది వర్తిస్తుంది. భగవానుని దయ సాధించాలంటే మనసు నిరంతరం పరమాత్మ యందే ఉండాలి. స్మరణ లేకపోయినా కనీసం, విశ్వాసం చెదరకుండా ఉంచుకోవాలి.

గృహస్థు సన్యసించనిదే భగవద్దర్శనం దొరకదని భావించనవసరం లేదు. కాషాయ వస్త్రాలు ధరించనిదే భగవంతుడు మనలను ప్రేమించడా? వేషం మారినంత మాత్రాన భగవంతుడు మనకు కనబడడు. మనసు మారాలి. జన్మజన్మార్జిత వాసనలు వదలాలి. శాస్త్రవాసన, దేహవాసన, లోకవాసన అనే వాసనాత్రయంతో కూడిన మనసు మలిన మనసు. మనసు శుద్ధము, అనిర్మలము అని రెండు విధాలుగా ఉంటుంది. కామసంకల్ప సహితమైనది మలినమనసు, కామవివర్జితమైనది శుద్ధ మనసు అని అమృతబిందూపనిషత్తు చెబుతున్నది. సంకల్పాలు, వాసనలు లేని మనసు శుద్ధమనసు. అది వాసనారహితమైతేగాని వాసుదేవుని దర్శనం కాదు.

చక్రాంకితాలు వేసుకున్నా, రుద్రాక్షలు ధరించినా, యింద్రియాలను, మనసును జయించనిదే తరించలేడు మానవుడు. "అవేమీ అవసరం లేదు నన్ను విశ్వాసంతో స్మరించండి చాలు. మీ విధి నిర్వహించండి, ఫలితం నాకు వదలండి" అంటాడు భగవానుడు. ఫీజు అడగని డాక్టరుకి ఎక్కువ డబ్బు వస్తుంది. స్వధర్మం ఆచరించండి. సోమరితనం రానివ్వకండి. భగవానుడిచ్చిన శక్తిని సద్వినియోగం చేయండి.

గృహస్థులుగా ఉండి వృత్తి ధర్మాన్ని చక్కగా నిర్వర్తిస్తూ ప్రతిరోజూ అవకాశం ఉన్నంతసేపు కొద్దిసమయంలోనైనా భగవద్ధ్యానం చేసుకుంటే చాలు. ఆ ధ్యానం అమూల్య ఫలితాలనిస్తుంది. అలవాటైనకొద్దీ ధ్యానంలో తీపి దొరుకుతుంది. ఆ ధ్యానామృతం లోపలికి వెళ్ళి కలుషాలన్నిటినీ హరిస్తుంది. గుణాలను శుద్ధ గుణాలుగా మారుస్తుంది. రాక్షస ప్రవృత్తిని దేవతా ప్రవృత్తిగా మారుస్తుంది. మేధస్సుకు పదునుపెట్టి చక్కని ఆలోచనలను సమయోచితంగా స్ఫురింపజేస్తుంది. అపాయాల నుండి తప్పించే ఉపాయాలను అందిస్తుంది. దేహానికి ఆరోగ్యాన్ని మనస్సుకి శాంతిని ఆనందాన్నిస్తుంది.

అట్టి మానవుడు దేశనాయకుడైతే దేశానికి, ప్రజలకు స్వార్థ రహితమైన సేవచేయగలుగుతాడు. గాంధీజీ వలె కర్మయోగిగా ప్రజల హృదయాలలో మంచి భావాలను ప్రవేశపెట్టి, ప్రేమను అందించి, వారి ప్రేమను చూరగొంటాడు. దేశానికి అటువంటి నాయకుడు ఒక్కడున్నా చాలు. దేశ ప్రజలందరికి మార్గ దర్శకుడై, తలలో నాలుకగా నిలుస్తాడు. అతనిని చూసి దేశప్రజలందరూ తమ శీల సంపదను తీర్చి దిద్దుకుంటారు. ప్రజలు బాగుపడితే దేశం సుభిక్షమై, బలిష్ఠమై వర్ధిల్లుతుంది.

అట్టి భగవానుడు మీకు అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములు ప్రసాదించి సర్వదా రక్షించుగాక!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమభక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన బాదరవాడ లక్ష్మీ నరసింహ రాజు (అబ్బీ)గారు 11-5-2013 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 64 సం॥లు. వీరికి భార్య, ముగ్గురు కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమరాళ్ళు కలరు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరుగాక! వీరు తమ నేత్రములను దానమిచ్చిన ధన్యజీవులు!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు

(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)

అతి తక్కువ ఫీజులతో, విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్.కె.జి నుండి టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

ప్రత్యేకతలు

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

120 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, స్కూలు యూనిఫారములు, పాఠ్య పుస్తకములు

* ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
* క్రమశిక్షణ సత్ ప్రవర్తన
* రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
* వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
* డేస్కాలర్స్‌కి బస్సు సైకర్యము
* బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
* నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

సంస్కృత మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

స్కాలర్‌షిప్‌లు పొందుతున్న విద్యార్థులకుఆ స్కాలర్‌షిప్‌ను డిగ్రీ వరకు కొనసాగించుట 'శ్రీచంద్రకాళీ విద్యానిధి' ప్రత్యేకత

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

<u>గమనిక</u> - స్కూలు ది. 3-6-2013న తెరువబడును. వివరములకు కరస్పాండెంట్ గారిని స్వయంగాగాని, ఫోన్ ద్వారాగాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

డా॥ కె.వి. ఆర్ రమణ కరస్పాండెంట్

ఫోన్ - 0863 - 2594211 (ఆఫీస్)

0863 - 2293824 (ఇల్లు)

మొబైల్ - 94411 27078

# శ్రీకృష్ణునిబాల లీలలు

- రమణ ప్రసాద్

మైయ్యా కబహి బఢేగీ చోటీ ?
కితీబార్ మోహి దూధ్ పీవత్ భయి, యహ అజహూ హై ఛోటీ ॥
తూ జో కహతి బల్ కీ బేనీ జ్యో, హై హే లంబీ -మోటీ ।
కాఢత్ - గుహత్- న్యహవావత్ జైహై నాగిన్-సీ భుయీ లోటీ ॥
కాఛో దూధ్ పియావతి పఛి - పఛి, దేతి న మాఖన్ రోటీ
సూరజ్ చిరజీవో దోవు భైయ్యా, హరి - హలధర కీ జోటీ॥

గోకులంలో గోపికలకు జడలు ఉన్నట్లే, గోపబాలురకుకూడా వారి తల్లులు తల దువ్వి జడ వేసి జడ చివర పూలు పెట్టేవారు. ఇక్కడ శ్యామసుందరుడు తల్లి యశోదతో "అమ్మా!నా జడ ఎప్పుడు పెరుగుతుంది? ఎప్పటి నుంచో పాలు త్రాగుతున్నా, నా జడ ఈరోజుదాకా ఇంకా చిన్న గానే ఉంది. నా జడ అన్న బలరాముని జడ లాగా పెద్దగా లావుగా అవుతుందని అన్నావు. అప్పుడు నువ్వు నాకు తల దువ్వి, జడ వేస్తే అది భూమిని తాకుతుందని కూడా చెప్పావు. కాని నీ మాటలు నిజం కావు.



నువ్వు నన్ను బలవంత పెట్టి గుమ్మపాలు తాగిస్తున్నావేగాని నాకు వెన్నతో కలిపి రొట్టె ఎప్పుడూపెట్టవు" అని మారాం చేస్తుంటే , సూరదాసు దానిని తిలకించి, ఉప్పొంగిపోతూ భగవానులైన బలరాముడూ, ఘనశ్యాముడూ యిద్దరి జోడీ నిరుపమానమైనదని, వారిద్దరూ శాశ్వత యశఃకాములై వర్ధిల్లాలని ఆశీర్వదిస్తున్నాడు!

*

## పుణ్యం - పాపం

రామతీర్థ కథ

ఒక ముసలమ్మ చచ్చిపోయి, యమధర్మరాజు దగ్గరకి పోయింది. యముడు చిత్రగుప్తునితో "ఈ మనిషి ఏమైనా పుణ్యం చేసిందేమో చూడు స్వర్గానికి పంపుదాం" అన్నాడు. "ఆమె ఒకే ఒక మంచిపని చేసింది. ఆకలిగొని ఉన్న బిచ్చగాడికి చిలకడదుంప దానం చేసింది" అని చిత్రగుప్తుడు చెప్పాడు. ఇంకేం ఆ చిలకడ దుంప తెప్పించి ముసలిదాని చేతిలో ఉంచారు. చిలకడదుంప స్వర్గం కేసి లేచింది. ముసల్ది కూడా లేచింది. ముసలమ్మ స్వర్గానికి పోతుండటం చూసి, బిచ్చగాడు ఆమె కొంగు పట్టుకుని, తను కూడా పైకి లేచాడు. మరొక ప్రాణి బిచ్చగాడి కాళ్ళు పట్టుకున్నాడు. ఇట్లా ఒకరి కాళ్ళు మరొకరు పట్టుకొని దండలాగ తయారై స్వర్గానికి బయలుదేరాయి. ఇంత మంది పట్టుకుని వేళ్ళాడుతున్నా, ముసలమ్మకు బరువేమి అనిపించలేదు. కాని తన చిలకడ దుంప మహాత్మ్యంతో వీళ్ళంతా స్వర్గానికి బయలుదేరటం సహించలేకపోయింది. ఆమె తన కొంగుపట్టుకున్న బిచ్చగాణ్ణి తోసేస్తూ "ఇది నా చిలకడ దుంప" అంది. కాని ఆమె ఆ బిచ్చగాడిని తోసేయటం కోసం పైనున్న చిలకడ దుంపను వదిలివేసింది. అందుచేత ముసలమ్మ, ఆమెను పట్టుకుని వేళ్ళాడుతున్నవారు కూడా నరకంలో పడిపోయారు.

నీతి - ఈర్ష్య మనిషి పతనానికి దారితీస్తుంది.

*    *        *    *        *    *

(అగ్నివర్షం - 24వ పేజీ తరువాయి భాగం)

గురువు, శిష్యులు చీకటిలో యిరుకు దారులలో వెళ్తున్నారు మౌనంగా. ఆ మౌనం అర్థంకాక ప్రశ్నార్థకంగా శిష్యులు 'ఎవరీయన?' అని ఆలోచిస్తున్నారు.

ఇంతలో ఆకాశం నుండి ఓ వాణి వినబడింది. "దేవుని కుమారుడు మానవవులను నరకాగ్ని జ్వాలల నుండి రక్షించటానికి దివి నుండి భువికి అవతరించాడు. ఆయన అవతరించినది శపించటానికి కాదు, ఆశీర్వదించటానికి.

ప్రభువును నిరాకరించి ఆ ప్రజలు తమ్ముతామే శపించుకున్నారు. వారు స్వీయశాపదగ్ధులు. ఈశ్వర పుత్రుడు ఆ గ్రామంలో ఎట్టి మహిమలు చూపలేదు. ఏ రోగిని స్వస్థ పరచలేదు. దరద్రుల ఆకలి తీర్చలేదు. శోకాశ్రువులను తుడవలేదు. నిత్యనూతనమైన ఈశ్వర శక్తి వారిలో ప్రవేశించలేదు."

ఈశ్వర పుత్రుని పాదమే వెలుగు. ఆ పాదం స్పర్శించని చోటే చీకటి. ఆకాశం అనంత నక్షత్రాల నేత్రాలతో మెల్లగా మౌనంగా నడచివెడుతున్న ప్రభువును తిలకించి పులకించింది!

*

# గులాబి కంపు

- జగం

కృష్ణపరమాత్ముడు ఒకరోజున ఆకాశంలో ఎగురుతున్న రాజహంసను చూసి, అర్జునుడితో "బావా! ఆ హంస ఎంత బాగుందో కదూ!" అన్నాడు. "అవును బావా! అది రాజహంస కదా! చాలా బాగుంది" అన్నాడు. వెంటనే కృష్ణుడు "బావా! అది కాకి. హంస కాదు" అన్నాడు. అర్జునుడు తడుముకోకుండా వెంటనే "అవును బావా! అది కాకే" అన్నాడు. "ఏమిటి అర్జునా! నేను హంస అంటే హంస అంటావు, కాకి అంటే కాకి అంటావు. నీకంటూ ఒక స్వంత ఆలోచన ఏదీ లేదా?" అన్నాడు కృష్ణుడు.

"బావా! కృష్ణా! నా మనస్సంతా నీది. అది నీ ఆధీనం అయినప్పుడు నాకు వేరే ఆలోచన ఎందుకు? సకల సృష్టి కర్తవు నీవు. సృష్టి అంతా నీ ఆధీనంలో ఉంటుంది. నీవు ఏది అంటే అదే అవుతుంది. కుంటివాడిని నడిపిస్తావు, గుడ్డివాడికి చూపునిస్తావు, మూగవాణ్ణి మాట్లాడిస్తావు, మూర్ఖుణ్ణి పండితునిగా చేస్తావు. నీకు సాధ్యము కానిది ఏదీ లేదు. నీవు హంస అంటే హంసే! కాకి అంటే కాకే!" అన్నాడు అర్జునుడు.

అటువంటిదే సద్గురుదేవులు శ్రీబాబు చేసిన యీ క్రింది లీల!

ఇది సుమారు 1942-43 సం॥ మధ్యలో జరిగింది. శ్రీబాబు తుని గ్రామంలో ఉన్న దాసరి సోమసుందరం గారింటికి వెళ్ళారు. అక్కడ పూజలు, సత్సంగాలు జరుగుతున్నాయి. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఒక డాక్టరమ్మగారు ఆ సత్సంగంలో పాల్గొనేవారు. వారింటిలో పూసే పువ్వులను పూజకు పంపేవారు.

ఒకరోజు సాయంత్రం సత్సంగానికి యింకా సమయం ఉండటంతో శ్రీబాబు ఆ డాక్టరమ్మగారింటికి వెళ్ళారు. సోమసుందరంగారు, దాసరి దేవళ్ళగారు, చి॥ పాలూరి వెంకట రమణ (సోమసుందరంగారి మేనల్లుడు, అప్పటికి 12సం॥ల బాలుడు; నేటి ఆశ్రమవాసి) యింకా కొంతమంది భక్తులు శ్రీబాబు వెంట ఉన్నారు. డాక్టరమ్మ యింకా ఆసుపత్రి నుంచి రాలేదు. శ్రీబాబు "ఎవరైనా సరే ముందు కర్తవ్య నిర్వహణ చేయాలి. అప్పుడే భగవంతుడు మెచ్చుకుంటాడు. అందులోనూ వైద్యవృత్తి. వైద్యో నారాయణో హరిః! అన్నారు కదా! ఎంతోమంది రోగులు వస్తారు. అందరి రోగాలూ నయం చేయాలి కదా. డాక్టరమ్మ వచ్చేవరకూ యిక్కడే కూర్చుందాం" అని, అక్కడ ఉన్న కుర్చీలో కూర్చున్నారు. భక్తులందరూ శ్రీబాబు పాదాలచెంత కూర్చున్నారు.

శ్రీ బాబు చి॥ రమణను పిలిచి, "నీ పేరేమిటి?" అని అడిగారు. "రమణండీ!" అన్నాడు. "ఏం చదువుతున్నావు?" "ఆరండీ! గురువుగారండీ!"అన్నాడు రమణ. "నువ్వు ఎప్పుడైనా అబద్దాలు చెబుతావా?" అడిగారు బాబు. "అయ్యబాబోయ్! అబద్దాలు అస్సలు చెప్పనండి. అబద్దాలు చెబితే మా మావయ్యగారు తోలు వలిచేస్తారండి" అన్నాడు రమణ. అందరూ నవ్వుకున్నారు.

శ్రీబాబు "మన ఇద్దరం ఒక పందెం వేసుకుందాం. నీ చేత నేను అబద్ధం చెప్పిస్తాను. సరేనా!" అన్నారు. "ఓ! సరేనండి. మీరు ఓడిపోతారండి. నేను ఓడిపోతే పది గుంజీలు తీస్తానండి" అన్నాడు రమణ. "నీ చేత అబద్ధం చెప్పించలేకపోతే నేను నీకు పటికబెల్లం ప్రసాదం యిస్తాను సరేనా?" అన్నారు బాబు. "అలాగేనండి. నాకు పటికబెల్లం అంటే చాల యిష్టమండి" అన్నాడు రమణ.

శ్రీబాబు గులాబి మొక్కను చూపిస్తూ "రమణా! ఒక గులాబీ పువ్వు కోసుకు రా" అన్నారు. బాగా విచ్చుకున్న పెద్ద గులాబీని రమణ కోసి తెచ్చాడు. "గుడ్! వాసన చూడు" అన్నారు బాబు. రమణ చూశాడు. "ఎలా ఉంది వాసన?" అన్నారు బాబు. "చాలా బాగుందండీ" అన్నాడు రమణ. "చాలా బాగుంది. అంటే?" అన్నారు బాబు. ఇంతలో డాక్టరమ్మగారు వచ్చారు. లోపలికి వెళ్ళి అందరికీ మజ్జిగ తెచ్చారు.

రమణ బుఱ్ఱ గోక్కుని "బాగుంది అంటే అచ్చం గులాబీవాసనే బాబుగారూ! చాలా బాగుందండీ" అన్నాడు. "ఛ! నిజంగానా! ఇంకోసారి వాసన చూసి సరిగా చెప్పు. అబద్ధం చెప్పకూడదు సుమా!" అన్నారు బాబు. రమణ మళ్ళీ గులాబిని ముక్కు దగ్గర పెట్టుకుని, కరెంట్ షాక్ కొట్టినట్లుగా గులాబిని దూరంగా విసిరేశాడు. "అదేమిటి గులాబిని అలా విసిరేశావు? కోసినందుకు డాక్టరమ్మగారు కోప్పడతారనా?" అన్నారు శ్రీబాబు.

"అది కాదండీ గురువుగారు! అది కుళ్ళుకంపు కొడుతోందండీ!" అన్నాడు రమణ ముక్కుమూసుకుంటూ. "డాక్టరమ్మగారూ మీ తోటలోని గులాబీ కుళ్ళుకంపు కొడుతోందిట. నిజమేనా రమణా?" అన్నారు బాబు. "నిజంగానండి. నా మీద ఒట్టండి. చేయి కూడా కంపు కొడుతోందండి" అన్నాడు రమణ.

డాక్టరమ్మ ఆశ్చర్యంగా "నిజంగానా రమణా? లేక సరదాగా అలా అంటున్నావా?" అని అడిగారు. "నిజంగా ఒట్టుగా అండి" అన్నాడు రమణ. "గులాబీ కుళ్ళు కంపు కొట్టటమేమిటి? అయినా ముందు వాసన చూసి చాలా బాగుంది అన్నావు కదా!" అన్నారావిడ. "అన్నానండి. అలాగా అన్నానండి, యిలాగా అన్నానండి. రెండూ కరెక్టేనండి" అన్నాడు రమణ. ఆవిడ అయోమయంలో పడి "రెండూ ఎలా కరెక్టు అవుతాయి?" అన్నారు చిరాకుగా.

శ్రీబాబు కల్పించుకుని "సరే రమణా. నీళ్ళతో చెయ్యి కడుక్కో" అన్నారు. ఎన్నిసార్లు తోమినా, పసుపు నీళ్ళతో కడిగినా కూడా చేతుల కుళ్ళు కంపు పోలేదు. బాబు యిచ్చిన నీళ్ళతో చెయ్యి కడిగాడు. "అమ్మయ్య! యిప్పుడు కంపు పోయిందండి గురువుగారండి, నన్ను బ్రతికించారండి" అన్నాడు రమణ.

"రమణా! గులాబీ వాసన చూసి, ముందు చాల బాగుంది అన్నావు, మళ్ళీ

చూసి కుళ్ళు కంపు కొడుతోందండీ అన్నావు. అంటే నువ్వు అబద్ధం చెప్పినట్లే కదా" అన్నారు బాబు. "కాదండి. అబద్ధం కాదండి. ఉన్నది ఉన్నట్లు చెప్పానండి. అయినా సరే గులాబీ వాసన, దానితోపాటుగా నా మాట కూడా మారిపోయాయి కాబట్టి పందెం అంటే పందెమేనండి. గుంజీలు తీసేస్తానండి" అంటూ గుంజీలు తీయటం మొదలు పెట్టాడు రమణ.

బాబు వారిస్తూ "గుంజీలు వద్దులే. నువ్వు ఓడిపోలేదు. నేను చెప్పింది చెప్పినట్లు చేశావు. అంతే. ఇదిగో నీకు పటిక బెల్లం ప్రసాదం" అని రమణకు ప్రసాదం అందించారు.

డాక్టరమ్మకు ఏమీ అర్థం కాక, "బాబూ! ఎలా చేశారు? గులాబీ వాసనను కుళ్ళు కంపుగా ఎలా మార్చారు? కంపు కొట్టే చేతులకు మాములు వాసన ఎలా తెప్పించారు?" అని అడిగారు.

దానికి సమాధానంగా శ్రీబాబు నవ్వుతూ "నాదేమీ లేదు. అంతా అమ్మ లీల! మా అమ్మ జగజ్జనని అప్పుడప్పుడు నాచేత యిలా విచిత్రాలు చేయించి, చూస్తూ, సంతోషిస్తూ ఉంటుంది" అన్నారు. "అదేం కాదు. అంతా మీ మాయే!" అన్నాడు రమణ. మిగిలిన అందరూ "అదంతా మీ మహిమ, మీ లీల! జై సద్గురు మహరాజ్‌కి జై!" అని జయజయ ధ్వానాలు చేసి, చేతులు జోడించారు!

*

**శ్రీసద్గురు ప్రసాదిత (50వ,) స్వర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు**
**శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన**
**సర్ణోత్సవ కార్యక్రమాలు**

**స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాళీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావునయావన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.**

<u>కార్యక్రమములు</u>

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హెూమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.

2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగుతాయి.

# గుడి

- పళని

(ఈ కథ 1983 మే సద్గురు మాస పత్రికలో ప్రచురింపబడినది)

పూర్వకాలంలో దక్షిణదేశంలో టిన్నూరు అనే గ్రామంలో పోసలార్ అనే శైవ భక్తుడు ఉండేవాడు. అతను సదా ఆ సదాశివుని స్మరిస్తూ భక్తులను సేవిస్తూ కాలం గడుపుతూ ఉండేవాడు. ఆ భక్తునకు ఒక రోజున ఆ భక్త హృదయనివాసికి గుడి కట్టాలని అనిపించింది. కాని తాను దరిద్రుడు. అందువలన చందాలకు అందరి దగ్గరకూ తిరిగాడు. శుష్కప్రియాలతో శూన్యహస్తాలు చూపారు. అతను నిరుత్సాహపడలేదు. ధనానికి పేదవాడే కాని, భక్తికి పేదవాడు కాదు. తన సంకల్పాలతో మనో సీమలోనే గుడి కట్టాలని నిర్ణయించుకున్నాడు.

దూరదేశాల నుండి కలపను, రాళ్ళను చేర్చాడు. ఒక శుభలగ్నంలో శంకుస్థాపన చేసి, చేయి తిరిగిన శిల్పులను నియమించాడు. ఆగమ శాస్త్రానుసారం గుడి గోపురములు, ముఖద్వారములు, సత్రములు లేస్తున్నాయి. ఆ భక్తుడు విరామ మెరుగక రాత్రింబవళ్ళు దగ్గర ఉండి ప్రతి పనినీ తనిఖీ చేస్తున్నాడు. గుడి పూర్తి అయింది. ఒక స్ఫటిక శాలలో లింగాన్ని చెక్కించాడు. ఆ లింగం దివ్యతేజస్సుతో తేజరిల్లుతోంది. ఇక జరుగవలసినది లింగ ప్రతిష్ఠ దైవజ్ఞులతో సంప్రదించి మహూర్తం నిర్ణయించాడు.

ఆ కాలంలోనే కంచిలో పల్లవరాజు లక్షలు వెచ్చించి బ్రహ్మాండమైన శైవ దేవాలయం నిర్మించి లింగ ప్రతిష్ఠకై ముహూర్తం నిర్ణయించాడు. రేపు ముహూర్తం అనగా ఆ రాత్రి ఈశ్వరుడు రాజుకు కలలో కనబడి "ఓరాజా! నా భక్తుడు పోసలార్ టిన్నూరులో నాకై గుడి కట్టాడు. రేపే అచ్చట నా ప్రతిష్ఠ కావాలి. దానికి నేను విధిగా హాజరు కావాలి. కనుక నీ ప్రతిష్ఠ వాయిదా వేసుకో" అని చెప్పాడు.

రాజు వెంటనే లేచి మంత్రులు, సామంతులతో, రథ, గజ, తురగ వాహనాలపై టిన్నూరు ప్రయాణమయ్యాడు. పరమేశ్వరుడు స్వయంగా హాజరయ్యే ఆ ఉత్సవాలను కన్నులారా చూసి ధన్యత చెందాలని అతని ఆశ. టిన్నూరు ప్రజలు, పల్లవ రాజు ఒకరిని చూసి మరొకరు ఆశ్చర్య చకితులయ్యారు. టిన్నూరులో గుడిలేదు. గోపురము మొదలే లేదు. అసలు ఆ ఊసే ఆ ఊరి ప్రజలు ఎరుగరు. పల్లవరాజుకు మతి పోయింది; కాని ఆశ పోలేదు. భూసురోత్తములను రావించి తన కలను గురించి చెప్పాడు. వారు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఒక వయోవృద్ధుడు మాత్రం "ఒక పోసలార్ అనే అతను ఉన్నాడు. తమ ఆజ్ఞ అయితే అతన్ని మీ ముందు పెట్టగలము" అన్నాడు.

రాజు "ఆ భక్తాగ్రేసురుని యింటికి మనమే స్వయంగా వెడదాం పదండి" అన్నాడు. అందరూ పోసలార్ ఇంటికి వెళ్ళారు. ఆ రాజును చూసి ఆ భక్తుడు భయపడిపోయాడు. తీరా రాజు స్వప్నం గురించి విన్నాక ఆనంద భాష్పాలతో "పరమేశ్వరా! భక్తవత్సలా! ఈ దరిద్రుడి గుడి ప్రతిష్ఠకై నీవే స్వయంగా వస్తావా! అంతటి మహాదృష్టమా! అంటూ పొంగిపోయి తాను తన మనస్సులోనే సంకల్పాలతో గుడికట్టిన సంగతి వివరించాడు. అందరూ ఆశ్చర్యంలో మునిగితేలారు!!

## శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
## అందరూ ఆహ్వానితులే!

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి. మహామంగళహారతి, దీక్షావిరమణ.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హోమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతీశ్వర పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి – విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

1963 కార్తీక బహుళ తదియ రాజుగారు స్వస్వరూప లయం పొందిన రోజు. 1988 కార్తీక బహుళ దశమి శ్రీగురుదేవుల అవతార పరిసమాప్తి దినం. ప్రతియేటా జరిగే శ్రీ సద్గురువార్షిక ఆరాధాన సాప్తాహ్నిక మహోత్సవాలు కార్తిక బహుళ తదియ శిష్యుని ఆరాధనతో ప్రారంభమై, కార్తీక బహుళ దశమి గురుదేవుల ఆరాధనతో పరిసమాప్తి కావటం కాకతాళీయం కాదు. అది శిష్యునికి, గురువునకు గల అనన్య భావనను సూచించే మహారాధన.



ఆ విధంగా మహాక్షేత్రంలో తాము కోరుకున్న విధంగా సద్గురు సన్నిధిలో, శ్రీగురుచరణారవిందాలయందు ఏకాగ్రమై నిలచిన మనస్సుతో, తమ భౌతిక కాయాన్ని త్యజించారు రాజుగారు. నిజభక్తునికి యిచ్చిన మాటను స్వామి నిలుపుకున్నారు. వారి యావత్ కుటుంబానికి సంరక్షణ భారం తామే వహించి, సాధన మార్గంలో సుశీఘ్ర పురోగాములుగా నడిపిస్తున్నారు.

ఆశ్రమంలో శ్రీబాబు విజ్ఞాన మందిరంలో శ్రీబాబు నివసించే గదికి బయట హాలులో, చిరంజీవిరాజుగారి చిత్రపటం జీవకళలొలికిస్తూ, దరహాస కాంతులు విరజిమ్ముతూ శ్రీబాబు చిత్రపటానికి ఎదురుగా కనిపిస్తుంది. బింబమైన గురుదేవునికి సచ్ఛిష్యుడు ఎలా ప్రతిబింబ స్వరూపుడై భాసిస్తాడో ఆ దృశ్యం తెలుపుతూ ఉంటుంది.

తరువాత రోజులలో చంద్ర ప్రతిరోజూ హాలులో ఉన్న శ్రీబాబు చిత్రపటాన్ని మాత్రం శుభ్రంగా తుడిచి, పూలతో అలంకరించేది. శ్రీబాబు యీ విషయం గమనించి, ఒకనాడు చంద్రతో “చందూ! ప్రతి రోజూ నువ్వు నా ఫొటోకు పువ్వులు అలంకరిస్తున్నావు కదా! మరి మీ నాన్న ఫొటోకు ఒక్క పూవ్వయినా పెట్టవేమీ? కనీసం తుడవటం లేదే? ఎందుకని?” అని అడిగారు. ముందు కొంచెం తొట్రుపాటు పడి చంద్ర తరువాత సర్దుకొని “నాన్నగారు నాకీ కర్మ దేహాన్ని యివ్వగలిగారు కాని, దానిని తరింపజేసి జన్మ రాహిత్యాన్ని ప్రసాదించగల గురుదేవులు తమరు కదా బాబూ?” అన్నది.

కొంచెం తీవ్రస్వరంతో బాబు “ఓహో! గురుబోధను చాలా శ్రద్ధగా వింటున్నాను, అర్థం చేసుకున్నాను’ అనుకున్నావు, కానీ నీవు నిజంగా విని, అర్థం

చేసుకుని ఉంటే యిలా సమాధానం చెప్పవు.

తల్లిదండ్రులు కర్మ ద్వారా యీ శరీరాన్ని యివ్వగలరు కాని, కర్మ రహితం చేసి, మళ్ళీ జన్మ లేకుండా చేయగల సమర్థుడు గురువు మాత్రమే అని నేను చెప్పిన మాట నిజమే. ఆ గురుబోధా వాక్యాన్ని నీవు బాగా విన్నమాట నిజమే. కాని, 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ' అనే వేదవాక్యాలను నేను వివరిస్తూ, 84లక్షల జీవరాసులలోనూ ఉత్తమమైనది, పునరావృత్తి రహితమైన మోక్షపదవిని సాధించటానికి ఉపకరించేది మానవజన్మ ఒక్కటే. అది నీకు నీ తల్లిదండ్రుల వలనే లభించింది. వారు నీకీ మానవ జన్మను ప్రసాదించటం వలనే కదా, నిన్ను తరింపజేసే ఆచార్యుని సేవించ గలుగుతున్నావు? కనుక తల్లిదండ్రులే పరమ పూజ్యులు, దైవ స్వరూపులు అయిన ప్రథమ గురువులు.

తల్లిదండ్రులను భక్తి శ్రద్ధలతోను, కృతజ్ఞతా భావనతో సేవించుకోగల శిష్యుడే ఆచార్యుని కృపకు పాత్రుడు కాగలడు అని చెప్పిన బోధను మర్చిపోయావా? తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన శిష్యుని పూజను గురుదేవుడు స్వీకరించడు. ముందుగా వెళ్ళి మా చిరంజీవిని అంటే నీ తండ్రిని శ్రద్ధగా పూజించు. సద్గురు ప్రాప్తిని నీకు ప్రసాదించిన పుణ్యాత్ముడు అతడే. నా హృదయాన్ని గెలుచుకుని, నా ప్రేమను చూరగొని శాశ్వతంగా నాలో నిలిచిపోయినవాడు మా చిరంజీవి. నన్ను పూజించిన దానికంటె అతన్ని పూజిస్తేనే నేను ఎక్కువగా ఆనందపడతాను. ఇక నుంచి ముందుగా మా చిరంజీవి ఫోటోను తుడచి అలంకరించిన తరువాతనే నా ఫోటోను అలంకరించాలి" అని హెచ్చరించారు.

మందలింపుగా కనిపిస్తున్న ఆ హెచ్చరికలో ఎంత దివ్యబోధ యిమిడి ఉన్నదో, ఎంతగా గురు ప్రేమామృతము ఫోటోలోని ఆ శిష్యునిపైన, పూజించే యీ శిష్యురాలిపైన అవ్యాజంగా వర్షించిందో తలచుకుంటూ, యిప్పటికి కూడా శ్రీమాతాజీకి ఆ హాలులోని ఫోటోల వద్దకు వెళ్ళినప్పుడల్లా కళ్ళు చెమరుస్తాయి.

ఎప్పుడో, ఎక్కడో రాలిపోవలసిన యీ శరీరం, జన్మజన్మాంతరాల పుణ్యం రాశీభూతమైనందువలన సమర్థ సద్గురు సమాశ్రయం పొందగలగటం, సద్గురుదేవుని శ్రీచరణాలపైన పూజా కుసుమంగా రాలిపోవటం ఎంత అదృష్టం! అది కావాలని కోరుకునేవారు ఎందరో ఉండవచ్చు, కాని ఎందరికి ఆ భాగ్యం లభిస్తుంది? కాని, తన తను మనో ధనాలను సర్వస్వములను శ్రీగురు చరణ సమర్పణ చేసి, అచంచల విశ్వాసంతో సేవించుకున్న శిష్యునికి మాత్రం అది కరతలామలకము.

- సశేషం

# శ్రీ రాధామాధవ రససుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

హే ప్రియతమా! రాధికా! నీ మహిమ అనుపమైనది. వాక్కులకతీతమైనది. అపారమైనది. యుగయుగాలుగా నేను నిర్విరామంగా సంకీర్తన చేస్తున్నాను. ఏనాడూ దానికి అంతం కానరాలేదు.



నీ అమూల్య మధురవాక్కు హృదయంలో ఆనంద సుధను వర్షింప జేస్తుంది.
నీ మధుర పద్మేక్షణాలకూ, కుటిల భ్రూభంగానికీ నేను సదా అమ్ముడుపోయాను.

నీ అనుపమ ఉత్తమ మధుర నామాన్ని మురళిపై నిత్యం జపిస్తూ ఉంటాను.
నీ యొక్క అత్యభిరామమై న రూపాన్ని నిత్యం అతృప్త నేత్రాలతో గ్రోలుతూ ఉంటాను.

ఇట్టి విశుద్ధ ప్రేమ ఎక్కడా లభించలేదు. మరెక్కడా నా మనస్సులోని ఆశలు పూర్తిగా సిద్ధించలేదు.
నీ ఒక్కతెలో మాత్రమే నా అభిలాషకు పరిపూర్ణ సిద్ధి సంప్రాప్తించింది.

ఈ స్థితిలో నిత్యతృప్తుడను, నిత్య నిష్కాముడను అయిన నాలో నిరంతర మధురా సంతుష్టిని మధురతమమైన కామ్యాన్నీ కలిగించడం, నీ దివ్య ప్రేమ యొక్క మధుర మాయా పరిణామం.

నీ

శ్యామ సుందరుడు.





గతసంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

ఛాంగదేవా! వాద్యంనుండి వెలువడక ముందే ఆ ధ్వని ఆకాశంలో ఉంటుంది. రూపం దాల్చక ముందు అగ్ని కట్టెలో లీనమైనట్టుగా. అగ్నిని ప్రేరేపిస్తే ధ్వని అగ్ని ప్రకటితమౌతుంది. అన్ని వస్తువులను కన్ను చూడగలదు. ఆ కన్నే తనను తాను చూసుకోజాలదు. ఆత్మజ్ఞాన స్వరూపడవై ఉండటం వలన తెలుసుకోవటం అనే వ్యవహారం జరగదు. మౌనమే అతని భాష. అనాత్మ వస్తువులను పరిత్యజిస్తే ఆత్మని తెలుసుకోగలుగుతాం. అన్ని వ్యవహారాలకీ సత్తా ఇచ్చే జ్ఞానం ఒక్కటే. నీటి అలలా భాసించే నీరు ఒక్కటే.



ఛాంగదేవా! నీవు ఆ పరమాత్మ పుత్రుడవు. ఆత్మకి పరమాత్మకి భేదం లేదు. నీకూ నాకూ భేదం లేదు. నా ఉపదేశాన్ని వినటం అంటే నీ ఉపదేశాన్ని నీవు విన్నట్టే.

ఛాంగదేవా! నిన్ను కలుకుకోవాలని నా ప్రాణం కొట్టు మిట్టాడుతోంది. కాని నా మనస్సు ఆత్మాకారం కలిగితే నిన్ను చూడటం అనేది హాస్యాస్పదం.

ఆత్మతత్వాన్ని నీకు చెపుతుంటే నాలో నేను అనేది నశించిపోతుంది. ఉప్పురాయి బావి లోతు చూడటానికి వెళ్తే దాని రూపం నశించి పోతుంది. ఇక నీటి లోతు చూసేదెవరు? ఇదే విధంగా ఆత్మస్వరూపం ఎలాంటిదో చూడబోతే 'నేను' అనేది నశిస్తుంది. నిద్ర ఎలా ఉంటుందో, దానికి ఎదురు చూస్తే, అది వాడికి కనిపిస్తే వాడు మేల్కొనినవాడు అంటామా? నేను అనే వస్తువును చూడబోతే ఆ నేను తానైపోయి చూచేవాడు లేకుండా పోతాడు.

చేతి వేళ్లతో కళ్ళను గట్టిగా అదిమి పెట్టితే, ఆ కంటిలో విచిత్ర దృశ్యాలు అనేక రంగులో కనిపిస్తాయి. కానీ చూసే కన్ను ఒక్కటే. ఆత్మైక్యత అనే దానిలో నిన్ను నేను ఎలా కలుసుకున్నానో, ఇంతసేపు ఏ స్థితిని నీకు వర్ణించి చెప్పానో ఆ స్వరూపాన్ని నీవు అనుభవించెదవు గాక!

అప్రమేయమైన పరమాత్మను విశదీకరిస్తూ శబ్దం ద్వారా వర్ణించలేని పరమాత్మను, నీలో నాలోని ఏకత్వాన్ని తెలపే సంవాదము ఈ నా పత్రము.

దీపం వెలుగుతుంటే 'నీవు వెలుగుతున్నావు' అని దానికి ఎవరూ చెప్పనక్కరలేదు. అది నాస్థితి. నాస్థితిని చూసి నువ్వు నీ యదార్ధ స్థితిని తెలుసుకో. అంటే "నేను బ్రహ్మమును" అని తెలుసుకో. ఆ ఆనందంలో ఉండిపో. నీ ఆత్మతత్వం నీకు స్పష్టంగా తెలిసేటట్లు భోదచేశాను. తద్వారా జ్ఞాన దృష్టిని సంపాదించుకో. నిన్ను నీవు తెలుసుకో.

ఛాంగదేవా! నీవు యోగైశ్వర్య సంపన్నుడవు, కాని అహం, మమత అనే వాటిని త్యజించి, అసంగుడవై కూటస్థమైన ఆత్మ నేను అని తెలుసుకో. ఈ విధంగా మనను మనం కలుసుకుంటాము. నేను, నావారు, సజాతీయులు, విజాతీయులు అనే భేదం మరచి శుద్ధమైన ఆత్మను నేను అని దృఢ నిశ్చయాన్ని చేసుకో. ఛాంగదేవా! నీ యదార్ధ స్వభావం సచ్చిదానందము. నామ రూపాతీతుడువైన నీవు, ఈ స్వాత్మానంద అనుభవంలో సుఖోపేతుడవు అయ్యెదవుగాక!

ఈ బ్రహ్మైక్యత్వజ్ఞానం భేదమునకు ఆవలగా ఉన్న సచ్చిదానంద స్వరూపాన్ని నీకు అందిస్తుంది. ఈ కొండగుర్తులను మాటి మాటికి గుర్తు పెట్టుకో. ఈ పత్రము నీకు వ్రాయమని ప్రేరేపించిన నా గురుదేవులైన నివృత్తి నాథులవారు నీకు ఉపదేశం చేయటం లేదు. ఆత్మానందమనే చక్కటి మిఠాయిని అత్యంత ప్రేమతో నన్నే తినమంటున్నారు.

జ్ఞానదేవులు తనకు వ్రాసిన ఉత్తరాన్ని చదివి ఛాంగదేవుడు జ్ఞాన సంపన్నుడైనాడు.

"ఎవరైతే మా ఇరువురి సంవాదాన్ని, నా ఉపదేశాన్ని నిరంతరం చింతిస్తారో వారు ఆనంద స్వరూపులై బ్రహ్మజ్ఞానాన్ని పొందుతారు. ఆత్మ ఇలా ఉంటుంది అలా ఉంటుంది అని చెప్పటానికి వీలుకాదు. ఆ స్వరూపం సర్వత్రా నిండివున్నా ఎక్కడా కనబడక పోవటం ఎంత ఆశ్చర్యం! దేహ కారణంగా ఉత్పన్న మయ్యే నిద్రకు ఆవల ఉన్న నిర్వికార పరమాత్మ స్వరూపం దేహ విషయక చింతలను నశింపజేసి, ఆత్మ జాగృతి, ఆత్మైకృత్వము కలిగించే విధానం ఇందులో విశదీకరించబడినది" అని జ్ఞానదేవులు అంటున్నారు.

ఛాంగదేవుడు ఆ ఉత్తరాన్ని చదువుకున్నాడు. భావార్థాన్ని గ్రహించలేక పోయాడు. చివరకు జ్ఞానదేవులను దర్శించాలి అని నిర్ణయించుకున్నాడు. జ్ఞానదేవులవారికి తన యోగశక్తులు ప్రకటించాలి అని భావించి, ఒక పులిపై అసీనుడై కొరడాగా చేతిలో త్రాచు పామును ధరించి జ్ఞాదేవులవారి దర్శనానికి వచ్చాడు. అదే సమయానికి నివృత్తి నాధుడు, సోపాన్, ముక్తాబాయిలు ఒక చిన్న గోడపై శాస్త్ర చర్చ చేస్తూ ఉన్నారు. ఛాంగదేవులు వ్యాఘ్రంపై రావటం జ్ఞానదేవుడు చూశాడు. అతనికి

గుణపాఠం నేర్పాలని భావించి తాము ఆసీనులై ఉన్న గోడను కదిలించి ఎదురుగా వెళ్ళి ఛాంగదేవుడిని ఆహ్వానించారు. ఛాంగదేవుడు, జ్ఞానదేవులవారి మహిమను చూసి దిగ్భ్రాంతి చెందాడు. క్రూరజంతువైన వ్యాఘ్రం చైతన్యంతో కూడిన ప్రాణి. కాని జడమైన గోడని నడిపించటం అద్భుత మహిమాన్విత కార్యం. వెంటనే ఛాంగదేవుడు జ్ఞానదేవుని పాదాలపై పడి జ్ఞాన భిక్ష కోరాడు.

ఛాంగదేవుని హృదయంలో దాగిఉన్న అహంకారశేషాన్ని కూడా నిర్మూలించ దలిచాడు జ్ఞానదేవుడు. ఛాంగదేవా! నీ కొరకు ప్రాణాన్ని ఇవ్వగలిగేవారు ఎవరైనా ఉన్నారా? ఉపదేశ సమయంలో ప్రాణదక్షిణ కావలిసి ఉన్నది అని చెప్పారు జ్ఞానదేవులు.

“స్వామి! నాకు వేలమంది శిష్యులు ఉన్నారు. అవసరమైతే నాకొరకు ప్రాణాలను అవలీలగా ఇస్తారు” అన్నాడు ఛాంగదేవుడు. “అయితే రేపు ఉదయాన ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని తీసుకొనిరా. రేపు ఉదయమే నీకు ఉపదేశం ఇవ్వబడుతుంది” అని జ్ఞానదేవులు తెలిపారు.

ఛాంగదేవుడు బయలుదేరి వెళ్ళాడు తన శిష్యగణాన్ని కలుసుకున్నాడు. విషయం తెలియ చేశాడు. కాని తనకోసం ప్రాణత్యాగం చెయ్యటానికి ఎవ్వరూ సమ్మతించలేదు. పైగా స్వార్థపరుడు అని దూషించ సాగారు. ఛాంగదేవునిలో పరివర్తన కలిగింది. హృదయం అవేదనతో నిండిపోయింది. ఈ ప్రపంచంలో ప్రకటించబడే అభిమానాలు ఎండమావులలో నీళ్ళవంటివి అని గ్రహించాడు. జ్ఞానదేవుల వారి వద్దకు వెళ్ళి నమస్కరించి “నా కొరకు ప్రాణత్యాగం చేసేవారు ఒక్కరూ లభించలేదు. నా శిరస్సునే సమర్పిస్తాను” అన్నాడు.

జ్ఞానదేవుడు నవ్వుతూ “బలి జరిగిపోయింది. అహంకారాన్ని బలి ఇవ్వటమే నిజమైన త్యాగం. నీ అహంకారం సమూలంగా నశించిపోయింది. నీవు దీక్ష తీసుకొనటానికి అర్హుడవు అయ్యావు” అని చెప్పి ముక్తాబాయిని ఉపదేశం చేయమని చెప్పాడు. ముక్తాబాయి ఛాంగదేవునికి దీక్ష నిచ్చి జ్ఞానబోధ చేసింది.

నాయనా! సంసారమనే కీకారణ్యం అతి భయంకరమైనది. అతి ప్రయాసతో లౌకికకర్మలను మాని ప్రతిఫలాపేక్షలేక నిత్యనైమిత్తిక కర్మలను చేస్తూ దైవానుగ్రహం చేత పరిశుద్ధ చిత్త మనస్కుడైనవాడు బ్రహ్మైక్య సాక్షాత్కార విచారమునకు అధికారి అవుతాడు. ఈ విధముగా తత్త్వ బోధ చేసి ఛాంగదేవుని ఆశీర్వదించింది.

–సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL